గురువారం
25-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 34
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చంద్రుడిపై నీటి జాడ...

బీజింగ్: చాంగే-5 సాయంతో చంద్రుడి నుంచి మట్టిని భూమికి తెచ్చిన చైనా... జాబిల్లిపై నీటి ఆనవాళ్లను తాజా పరిశోధనల్లో గుర్తించింది. ఈ మేరకు చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పేర్కొంది. 2020లో చేపట్టిన చాంగే-5 ప్రయోగం ద్వారా చంద్రుడి ఉపరితలం నుంచి రెండు కిలోల మట్టి, రాళ్ల నమూనాలు భూమికి చేరాయి. వాటిపై బీజింగ్ నేషనల్ లాబొరేటరీ ఫర్ కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్, సీఏఎస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ పరిశోధకులు అధ్యయనంలో నీటి అణువులను గుర్తించారు. సంబంధిత పరిశోధన పత్రాన్ని ఓ జర్నల్‌లో ప్రచురించింది.

నీతి ఆయోగ్ భేటీ బహిష్కరణ

'ఇండియా' ముఖ్యమంత్రుల నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో విపక్ష రాష్ట్రాలపై తీవ్ర వివక్ష ప్రదర్శించడాన్ని నిరసిస్తూ ఈనెల 27న జరగబోయే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించాలని ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయించారు. ఫెడరలిజానికి వ్యతిరేకంగా బడ్జెట్‌లో వివక్షత చూపడాన్ని ముఖ్యమంత్రులు తీవ్రంగా నిరసించారు. ప్రధాని మోదీ అధ్యక్షతన 27న నీతి ఆయోగ్ సమావేశం జరగనున్నది. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మాత్రం సమావేశానికి వెళ్లి నేరుగా ప్రధానిని నిలదీయనున్నట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తానంటూ బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజే తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఆ తర్వాత కొన్ని గంటలకు కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ 'ఎక్స్'లో కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు

- మిగతా 2 లో

ఏమిటీ వివక్ష?

- కేంద్ర బడ్జెట్ తీరుపై ఇండియా నేతల మండిపాటు
- పార్లమెంటు వెలుపల నిరసన
- లోక్‌సభ నుంచి వాకౌట్

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపడాన్ని నిరసిస్తూ... కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సహా ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు బుధవారం పార్లమెంటు ఆవరణలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్ వాదీ పార్టీ, డీఎంకే, వామపక్షాలకు చెందిన ఎంపీలు పార్లమెంట్ మకర్ ద్వార్ కు వెళ్లే మెట్లపై జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం లోక్‌సభలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ... 'ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, ఎవరికీ న్యాయం జరగలేదు. వారు ప్రత్యేక ప్యాకేజీ గురించి మాట్లాడారు కానీ ప్రత్యేక హోదా ఇవ్వలేదు. ఇది మోసపూరిత బడ్జెట్. ప్రజలకు అన్యాయం చేశారు' అని విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ

- మిగతా 2 లో

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

- టేకాఫ్ సమయంలో జారిపడి క్షణాల్లో అగ్నిగోళంగా మారిన వైనం
- 18 మంది దుర్మరణం
- పైలట్‌కు గాయాలు

2లో

లెక్కలు తేలుస్తాం

- మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ
- ఎక్సైజ్ శాఖపై చంద్రబాబు శ్వేతపత్రం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీతో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. లోతైన విచారణ తర్వాత...అవసరమైతే ఈడీకీ సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖపై బుధవారం శాసనసభలో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ నేరస్థులు రాజకీయాల్లో ఉంటే రాజకీయాలు నేరాలమయమవుతాయన్నారు. నేరస్థుడే రాజకీయ నేత, సీఎం అయితే ఏం జరుగుతుందో గత ఐదేళ్లలో చూశాం. మద్యపాన నిషేధం, లిక్కర్ ఔట్‌లెట్స్ తగ్గింపు అని చెప్పి అడ్డగోలుగా దోపిడీ చేశారని విమర్శించారు. ప్రజలకు హామీ ఇచ్చామంటే అమలు చేసేదిగా ఉండాలి. మద్యం ధరలు పెంచుకుంటూ పోతే తాగేవాళ్లు తగ్గుతారని చెప్పారు. పొరుగురాష్ట్రాలతో పోలిస్తే ధరలు విపరీతంగా పెంచారు. అయినా మద్యం వినియోగం అమాంతం పెరిగిపోయింది. అయినా ఏపీలో ఆదాయం తగ్గింది. ఎందుకంటే ఆ ఆదాయం వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లింది. మద్యం షాపుల్లో కేవలం నగదు మాత్రమే తీసుకున్నారు. దాదాపు లక్ష కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వ శాఖలో ఇలా జరగడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. దేశంలో దొరికే లిక్కర్ బ్రాండ్‌లు ఏవీ ఏపీలో లేవు. ఐదు టాప్ బ్రాండ్ల కంపెనీలను తరిమేశారు. చెల్లింపు ఆలస్యం చేయడం, ఆర్డర్లు ఇవ్వకపోవడం వంటి చర్యలతో వారిని వేధించారు. లోకల్ బ్రాండ్లు తీసుకొచ్చి షాపుల్లో అధిక ధరలకు విక్రయించారు. వారు ఏవి అమ్మితే ప్రజలు అవే తాగే పరిస్థితిని కల్పించారు. మద్యం ఓ వ్యసనం. పేదవాడు శారీరకంగా కష్టపడి బాధలు మర్చిపోయేందుకు తాగుతారు. వారి అలవాటును బలహీనంగా చేసుకొని దారుణంగా దోచుకున్నారని చంద్రబాబు మండిపడ్డారు. ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో డబ్బు తీసుకొచ్చి ఎక్సైజ్ శాఖలో పెట్టుబడి పెట్టించారు. దీంతో ఆయా శాఖలకు దాదాపు రూ.250 కోట్ల నష్టం వాటిల్లింది. ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. సరైన పాలసీలు తీసుకొచ్చి పేదలకు అందుబాటు ధరలో మద్యం లభించే విధంగా చూడటంతోపాటు డీఅడిక్షన్

- మిగతా 2 లో

ఎంత మంది పిల్లలున్నా...

- తల్లికి వందనంపై మంత్రి లోకేశ్
- ఎప్పటి నుంచి అమలు అనే దానిపై అస్పష్టత



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన తల్లికి వందనం పథకం ఈ విద్యా సంవత్సరం నుంచా?, వచ్చే విద్యా సంవత్సరం నుంచా? అనే దానిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టత ఇవ్వలేదు. అయితే ఈ పథకాన్ని అమలు చేసి తీరుతామని, ఎంత మంది పిల్లలు ఉంటే, వారందరికీ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటుకూ వర్తింపజేస్తామని తెలిపారు. తల్లికి వందనం పథకంపై మార్గదర్శకాలను త్వరలో రూపొందిస్తామని, ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఒక ఇంట్లో ఎంత మంది ఎంత మంది పిల్లలు ఉంటే... వారందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు. శాసన మండలిలో బుధవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు తదితరులు తల్లికి వందన పథకం అమలుపై ఉన్న అనుమానాలు తొలగించాలని కోరారు.

రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన రీతిలో తల్లికి వందనంపైన స్పష్టత ఇవ్వాలని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఇస్తారా?, లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి కింద ఒక పిల్లవాడికే రూ.15 వేలు ప్రకటించినప్పటికీ కేవలం తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు మాత్రమే పడ్డాయని, మిగిలిన మొత్తం వాచ్‌మేన్, నిర్వహణకు కేటాయించారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం పథకంలో భాగంగా బడికి వెళ్లే పిల్లలు అందరికీ ఇస్తామన్నారని, పాత పథకంలోని లోపాలను అధ్యయనం చేసి, తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం ఉండేలా చూడాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి లోకేశ్ బదులిస్తూ, ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోల్లో తల్లికి వందన పథకాన్ని ఎంత మంది పిల్లలు ఉంటే... వారందరికీ ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ హామీకి కట్టుబడి ఉన్నామని

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యం ఖూనీ

- ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాలో వైసీపీ అధినేత జగన్
- సంఘీభావం ప్రకటించిన అనేక పార్టీల నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ: ఏపీలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఏపీలో అరాచక పాలన, హింసాత్మక పాలన కొనసాగుతుందంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైఎస్ జగన్ బుధవారం ధర్నా చేశారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. శిబిరం వద్దకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, ఆ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ (రాజ్యసభ), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) ప్రతినిధులు అబ్దుల్ హవాబ్, హ్యారీస్, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీ ముల్ హక్, ఏఐఏడీఎంకే రాజ్యసభ సభ్యులు

- మిగతా 2 లో

స్పోర్ట్స్ జాబితాకు కొర్రీ?

- గందరగోళంగా ఇంజినీరింగ్ వెబ్ కౌన్సెలింగ్
- 83 మంది విద్యార్థుల పేర్లు గల్లంతు
- మంత్రి లోకేశ్‌కు అభ్యర్థుల మొర
- సమగ్ర విచారణకు విన్నపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్ (2024) ఇంజినీరింగ్ విభాగం వెబ్ కౌన్సెలింగ్‌లో స్పోర్ట్స్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియ గందరగోళంగా మారింది. మొదటి విడత కౌన్సెలింగ్ సమయానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి ఉన్నత విద్యామండలికి అర్హులైన అభ్యర్థుల జాబితా వెళ్లలేదు. దీంతో మొదటి విడత కౌన్సెలింగ్ సీట్లలో స్పోర్ట్స్ కోటా సీట్లు కలపలేదు. పర్యవసానంగా వందలాది మంది అభ్యర్థుల సీట్లు కోల్పోయారు. దీనికి కారణం శాప్ అధికారుల నిర్లక్ష్యమా? లేక సాంకేతిక సమస్యలా? అనేదీ ఉన్నత విద్యామండలి నిగ్గు తేల్చాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపు ఉన్నత విద్యామండలి, శాప్ అధికారుల మధ్య సమన్వయ లోపమున్నట్లు విమర్శలు వచ్చాయి. తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ సమయానికి చేరాల్సిన స్పోర్ట్స్ జాబితా...తుది విడత కౌన్సెలింగ్ నాటికి విడుదల చేయడం, కొందరి పేర్లు తొలగించడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించాలని, సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ ప్రకటించిన తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూలు ఆధారంగా ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో స్పోర్ట్సు రిజర్వుడు అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారి పత్రాల నమోదుతో మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమయ్యారు. స్పోర్ట్స్ కోటా జాబితా సకాలంలో అందక వారికి చుక్కెదురైంది. చేసేదేమీ లేక జనరల్ కేటగిరి కింద వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. అదే స్పోర్ట్సు కోటా లభిస్తే మెరుగైన ఇంజినీరింగ్ కళాశాలలు, బ్రాంచీలను ఎంపిక చేసుకునే అవకాశం ఉండేది. రాష్ట్రంలో స్పోర్ట్సు కోటాలో ఇంజినీరింగ్ సీట్లు 609 ఉన్నట్లు సమాచారం. ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లోకి పేరొందిన తొమ్మిది ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు

- మిగతా 2 లో

మద్దతు ధర కోసం కేంద్రంపై ఒత్తిడి

- రైతు నాయకులకు రాహుల్ భరోసా
- ఢిల్లీ ప్రదర్శన కొనసాగిస్తాం: రైతు సంఘాల ప్రకటన

న్యూఢిల్లీ: రైతుల పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇచ్చేలా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ రైతు సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 12 మంది రైతు నాయకుల బృందం బుధవారం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పార్లమెంటు భవన సముదాయంలో సమావేశమై తమ రాష్ట్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. ఎంపీలు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, సుఖ్‌జిందర్ సింగ్ రంధావాతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, దీపేందర్ సింగ్ హుడా, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, గుర్జీత్ సింగ్ ఔజ్లా, ధరమ్‌వీర్ గాంధీ, అమర్‌సింగ్, జై ప్రకాష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశం ముగిసిన వెంటనే, గాంధీ పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ రైతులు తనను కలవాలని కోరుకోవడానికి కారణం చట్టపరమైన హామీతో కూడిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలనే వారి దీర్ఘకాల డిమాండ్‌ను మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం నెరవేర్చకపోవడమేనని అన్నారు. 'మేము ఫలవంతమైన చర్చలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నిరుద్యోగుల నెత్తిన కడివెడు నీళ్లు

ఆర్వీ రామారావ్

వ్యాధి సోకినప్పుడు మొట్టమొదట జరగవలసింది రోగ నిదానం. ఆ తరవాత నిర్ధారించవలసింది చికిత్సా విధానం. బడ్జెట్ ప్రతిపాదించడానికి ఒక రోజు ముందు పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రోగ నిదానం సవ్యంగానే చేశారు. 'అభివృద్ధికి, అభ్యున్నతికి ఉపాధి కీలకమైన లంకె. వీటి పరిణామం, నాణ్యత, ఆర్థిక ఫలితాలు జనం జీవన నాణ్యతను ఏ మేరకు ప్రభావితం చేస్తాయి' అని ఆర్థిక సర్వేలో తెలిపారు. నిర్మలా సీతారామన్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో ఆర్థిక శాస్త్రంలో ఎంఏ, ఎంఫిల్ దాకా చదివారు కనక రోగ నిదానంలో ఎక్కడా తడబడ లేదు. ఆర్థిక సర్వేలో ఉపాధి లేని అభివృద్ధికి సంబంధించిన గణాంకాలూ ఉన్నాయి. వస్తూత్పత్తి పరిశ్రమల్లో ఉద్యోగాలు 2013-14 నుంచి 2021-2022 మధ్య కేవలం 32 లక్షలు మాత్రమే పెరిగాయి. అందులోనూ ప్రధాన వాటా తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలదే.

టిప్పణి

నిరుద్యోగ సమస్య రోగ నిదానాన్ని సక్రమంగానే చేయగలిగిన నిర్మలా సీతారామన్...ఉద్యోగ కల్పన అవకాశాలు పెంచడానికి ఉడతా భక్తిగా ప్రయత్నం కూడా చేశారు. ఉపాధికి సంబంధించి మూడు మంత్రోపదేశాలు చేశారు. మొదటి ప్రోత్సాహకం ప్రకారం మొదటిసారి ఉద్యోగంలో చేరితే వారికి రూ.15,000కు మించకుండా ప్రోత్సాహకం అందజేస్తారు. అంటే వారు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో సభ్యులై ఉండాలి. అలా సభ్యులు కావడానికి కొన్ని నియమాలున్నాయి. అవి ఉద్యోగులకు అమలు కాకపోతే ఈ ప్రోత్సాహకం అందదు. కొత్తగా ఏర్పడిన సంస్థలకు భవిష్య నిధి బాదరబందీ ఉండదు. అంటే మొదటిసారి ఉద్యోగం సంపాదించిన వారైనా ఈ జల్లెడలో నిలవకపోతే అంతే సంగతి. రెండో ప్రోత్సాహకం వస్తూత్పత్తి పరిశ్రమల్లో మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి వేతనంలో సబ్సిడీ ఇస్తారు. అందులో కొంత యాజమాన్యానికీ దక్కుతుంది. అంటే ఉద్యోగాలు ఇచ్చే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకం ఉంటుందన్న మాట. మూడో ప్రోత్సాహకం ప్రకారం అదనంగా ఉద్యోగాలు

- మిగతా 2 లో

ఫలించిన చైనా దౌత్యం

బీజింగ్ డిక్లరేషన్‌పై పలస్తీనా వర్గాల సంతకాలు

స్వాగతించిన ప్రపంచ నేతలు, నిపుణులు

బీజింగ్: సమైక్య పలస్తీనా కోసం చైనా కసరత్తు సత్ఫలిస్తోందని, పలస్తీనాకు చెందిన 14 వర్గాలు కలిసిరావడం, బీజింగ్ డిక్లరేషన్‌పై సంతకాలు చేయడం కీలక ముందడుగని ప్రపంచ దేశాధినేతలు, నిపుణులు వేర్వేరు ప్రకటనలు చేశారు. చైనా పాత్రను కొనియాడారు. బీజింగ్ డిక్లరేషన్‌ను స్వాగతించారు. పలస్తీనా కోసం జరిగిన బీజింగ్ డిక్లరేషన్ ద్వారా ఘర్షణ తర్వాత పరిస్థితుల క్రమంలో నెలకొన్న జటిల సమస్యలకు తగిన పరిష్కారం లభించగలదని హమాస్ పేర్కొంది. చైనా దౌత్యం ఫలించిందనేందుకు బీజింగ్ డిక్లరేషనే సంకేతమని ఈజిప్టు నిపుణుడు అబు బకర్ అల్ దీప్ అన్నారు. సమైక్య పలస్తీనా సాధన దిశగా ఈ డిక్లరేషన్ మరింత సానుకూలమైన ముందడుగు కాగలదని హమాస్ వెల్లడించింది. బీజింగ్ డిక్లరేషన్‌ను ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ స్వాగతించారని ఆయనకు అధికార ప్రతినిధి స్టెఫనే దుజార్రిక్ తెలిపారు. పలస్తీనా ఐక్యతకు ఇది కీలక అడుగన్నారు. విభేదాలు, మనస్పర్థలు మరిచి ఐక్యంగా ముందుకు సాగాలని పలస్తీనా వర్గాలకు గుటెర్రస్ తరపున ఆమె సూచించారు. బీజింగ్ డిక్లరేషన్ కింద పలస్తీనా వర్గాలన్నీ ఏకం కావడం మంచి పరిణామమని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఒక ప్రకటన చేశారు. పలస్తీనా ప్రజల హక్కులను గ్రహించే దిశగా కీలక అడుగు పడిందన్నారు. ఈ డిక్లరేషన్ వల్ల క్షేత్రస్థాయి పరిస్థితుల్లో మార్పు రావడమే కాకుండా భవిష్యత్ సవాళ్లను అధిగమించగలరని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పలస్తీనియన్ల హక్కులకు మద్దతిచ్చేందుకు, పలస్తీనా వర్గాల ఏకీకరణకు నిబద్ధతతో కసరత్తు చేస్తోందంటూ చైనాపై ప్రశంసల వర్షాన్ని ప్రపంచ నాయకులు, నిపుణులు కురిపించారు. పలస్తీనా వర్గాలతో చైనా జరిపిన చర్చల ముగింపు సందర్భంగా ఈ డిక్లరేషన్‌పై సంతకాలు జరిగాయి. చైనా విదేశాంగ మంత్రి యాంగ్ యీ అధ్యక్షతన సమావేశం జరిగింది.

అమెరికా కమ్యూనిస్టు పార్టీతో జాగ్రత్త

సాలిడ్‌నెట్ పార్టీలకు కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఏ హెచ్చరిక

న్యూయార్క్: అమెరికా కమ్యూనిస్టు పార్టీతో జాగ్రత్త అంటూ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలకు కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఏ ఓ హెచ్చరిక చేసింది. 32వ జాతీయ సదస్సు తర్వాత తమ పార్టీ చీలిపోయినట్లు జరుగుతున్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఏ చీలిపోలేదని ఒక ప్రకటన చేసింది. తమ నుంచి విడిపోయిన 26 క్లబ్‌లతో 'అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ' ఏర్పడినట్లు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అనుకూలైన కొందరు ప్రచారం చేస్తున్నారని, తాము ఎంఏజీఏ కమ్యూనిస్టులమని చెప్పుకుంటున్నారని ప్రకటన పేర్కొంది. ట్రంప్ ఉద్యమానికి బలాన్ని చేకూర్చే ఉద్దేశంతోనే కొత్త పార్టీ తెరపైకొచ్చిందని కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఏ తెలిపింది.

ఈ మేరకు ఇంటర్నేషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఏ (సీపీయూఎస్ఏ)లో పాల్గొన్న సాలిడ్‌నెట్ పార్టీలు (కమ్యూనిస్టు అండ్ వర్కర్స్ పార్టీస్)కు ఒక హెచ్చరిక జారీచేసింది. 32వ జాతీయ మహాసభకు సంఘీభావాన్ని తెలియజేసినందుకు ఆ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపింది.

బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ సడలింపు

తెరుచుకున్న ఫ్యాక్టరీలు - పనిచేసిన బ్యాంకులు

ఢాకా: బంగ్లాదేశ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. కర్ఫ్యూ సడలించడంతో బుధవారం వస్త్ర కర్మాగారాలు, బ్యాంకులు తెరుచుకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థుల ఉద్యమంతో గత వారం బంగ్లాదేశ్ అట్టుడికిపోయింది. ఆందోళనల్లో 186 మంది ప్రాణాలు కోల్పోయారు. 2,500 మందికిపైగా పోలీసుల అదుపులో ఉన్నారు. పరిస్థితి మెరుగైన తర్వాత 'స్టే హోం' ఉత్తర్వులను సడలిస్తామని షేక్ హసీనా ప్రభుత్వం వెల్లడించింది. మంగళవారం సాయంత్రం నుంచి ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించారు. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ 20శాతంగానే ఉన్నట్లు నెట్‌బ్లాక్స్ సంస్థ పేర్కొంది. 2009 నుంచి దేశాన్ని షేక్ హసీనా పాలిస్తున్నారు. జనవరిలో జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షం లేకుండా నాల్గో సారి పగ్గాలు చేపట్టారు. షేక్ హసీనా హయాంలో ఇటువంటి అనిశ్చితి ఎన్నడూ నెలకొనలేదు. కాగా, శాంతి భద్రతల పరిరక్షణ కోసం వేలాది బలగాలు నగరాల్లో పెట్రోలింగ్ సాగిస్తున్నాయి. వారం పాటు స్తంభించిన బంగ్లాదేశ్ తేరుకుంది. సాధారణ పరిస్థితులు నెలకొనడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. తమ వ్యాపారం విషయంలో మదన పడినట్లు తెలిపారు. అయితే విద్యార్థుల డిమాండ్లు న్యాయమైనవని, వాటిని ప్రభుత్వం అంగీకరించాలని అన్నారు. ఉద్యమకారుల ప్రాణత్యాగాలు వ్యర్థం కారాదని, వారు భావితరాల కోసం తమ ప్రాణాలు అర్పించారన్నారు. ఇదిలావుంట, ఇంకా చాలా ప్రాంతాల్లో రోజుకు 19 గంటల పాటు ఆంక్షలు అమలయ్యాయి. రాజధాని ఢాకాలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పనిచేశాయి. రిజర్వుడ్ ఉద్యోగాల సంఖ్యను కుదిస్తూ సుప్రీంకోర్టు కూడా ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. అయితే రక్తపాతం దృష్ట్యా తమ ఆందోళనలను శుక్రవారం వరకు విద్యార్థి సంఘం వాయిదా వేసిన విషయం తెలిసిందే.

స్పోర్ట్స్ జాబితాకు కొర్రీ?

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామయ్యాయి. కన్వీనర్ కోటా కింద ఆయా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 35 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. ఇక్కడ స్పోర్ట్స్ కోటా వర్తిస్తోంది. సీట్లు పొందిన వారిలో అర్హులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తోంది. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకులు రాని పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌పైనే ఆధారపడుతుంటారు.

240 పేర్లతోనే సరి!

స్పోర్ట్స్ జాబితాను తొలి విడత కౌన్సెలింగ్‌కు బదులు రెండో విడత కౌన్సెలింగ్ సమయానికి విడుదల చేయడంతోనే గందరగోళ పరిస్థితి నెలకొంది. 240 మంది పేర్లతో ఈ జాబితా విడుదలైంది. బాస్కెట్ బాల్, రోలర్ స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, చెస్, బాడ్మింటన్, జుడో, రైఫిల్ షూటింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్ తదితర విభాగాలతో జాబితాను విడుదల చేశారు. అన్ని క్రీడా సంఘాలను భాగస్వామ్యం చేయకపోవడంతో మరో 23 మంది పేర్లు జాబితాలోకి వెళ్లలేదని అభ్యర్థులు తెలిపారు. దీనికి శాప్ నిర్లక్ష్యమే కారణమన్నారు. 23, 24 తేదీల్లోగా జాబితాపై అభ్యంతరాలను తెలిపేందుకు సమయం ఇచ్చారు. కొన్ని అసోసియేషన్లు విద్యార్థుల వివరాలను పంపకపోవడంతో 'నాట్ అలాటెడ్ ఇన్ స్పోర్ట్స్ కోటా' అని పొందుపరిచారు. దీనివల్ల 83 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ కోటా కింద ఇంజినీరింగ్ సీటు కోల్పోయే అవకాశముంది.

మద్దతు ధర కోసం కేంద్రంపై ఒత్తిడి

(మొదటిపేజీ తరువాయి)

చేశాం. కాంగ్రెస్ పార్టీ చట్టపరమైన హామీతో ఎంఎస్‌పీకి మద్దతు ఇస్తుంది. మా మేనిఫెస్టోలో కూడా పేర్కొన్నాం. మా ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములతో ఈ సమస్యను చర్చిస్తాం. వారిని ఒప్పించి మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం' అని రాహుల్ గాంధీ చెప్పారు. అయితే రైతులను పార్లమెంటు లోపలికి అనుమతించకపోవడంతో తొలుత గందరగోళం నెలకొంది. అంతకుముందు రాహుల్ మాట్లాడుతూ 'మేము వారిని ఆహ్వానించాము. కానీ వారిని పార్లమెంటు లోపలికి అనుమతించడం లేదు. బహుశా వారు రైతులనే కావచ్చు. దీనికి కారణాన్ని మీరు ప్రధానిని అడగాలి' అని గాంధీ అన్నారు. రైతుల్లో ఒకరైన జగ్జీత్ సింగ్ దల్లేవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. స్వామినాథన్ నివేదిక అమలు తప్పనిసరి అని స్పష్టం చేస్తూ, దిల్లీ వైపు పాదయాత్రను కొనసాగిస్తామని తెలిపారు. 'పార్లమెంటు లోపల రాహుల్ గాంధీ రైతుల గొంతును లేవనెత్తారు' అని ఎంపీ వారింగ్ సమావేశం తర్వాత ఒక ఆంగ్ల వార్తా సంస్థకు తెలిపారు. రైతులు దిల్లీలో మరో ప్రదర్శనకు ప్రణాళిక చేస్తున్నారనే వార్తలపై స్పందిస్తూ, 'దిల్లీకి వచ్చి నిరసన తెలిపేందుకు వారికి అన్ని హక్కులు ఉన్నాయి. ప్రైవేట్ మెంబర్ బిల్లు అవసరమైతే మేము దానిని కూడా తీసుకువస్తాం' అని అన్నారు. అంతకుముందు, రైతులు తమ రాష్ట్రాల్లోని సమస్యల గురించి గాంధీతో మాట్లాడారని, దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చడానికి, ఎంఎస్‌పీని సవరించడానికి, చట్టపరమైన మద్దతుని నిర్ధారించడానికి ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టాలని కూడా ఆయనను కోరారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ డిమాండ్లు 2020లో ప్రారంభమైనప్పటి నుంచి వారి నిరసనలలో ప్రధానమైనవి. అయితే ఈ సమావేశాన్ని 'రెచ్చగొట్టే ప్రయత్నం' అని ప్రభుత్వం వెంటనే కొట్టిపారేసింది. కేంద్ర మంత్రి భగీరథ్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ మూడో దఫా రైతులకే అంకితం అన్నారు. 'ప్రధాని మోదీ మూడో దఫా ప్రభుత్వాన్ని రైతుల కోసం అంకితం చేశారని దేశ ప్రజలు చెబుతున్నారని.. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం 'కిసాన్ సమ్మాన్ నిధి... రాహుల్ గాంధీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు... అతని వల్ల ప్రభావితం కావద్దని మేము వారిని అభ్యర్థిస్తున్నాం' అని మీడియాతో అన్నారు. కాగా, దేశవ్యాప్తంగా రైతు సంఘాలు స్వామినాథన్ కమిషన్ సి2+50 ఫార్ములా ఆధారంగా పంటలకు కనీస మద్దతు ధర అందించాలని కోరుతున్నాయి. అయితే ఇది మద్దతు ధరలను లెక్కించేటప్పుడు మూలధనం, భూమి అద్దెపై ఆధారపడి ఉంటుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, రైతులకు మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం ఉన్న ఏ2+ఎఫ్ఎల్+50 శాతం పద్ధతిని వదులుకునేందుకు ప్రభుత్వం విముఖత చూపుతోంది. దిల్లీ చుట్టూ నెలల తరబడి దిగ్బంధనాలు, రైతులు, పోలీసుల మధ్య హింసాత్మక ఘర్షణల తరువాత, మోదీ రెండవ దఫా అధికారం చేపట్టిన సమయంలో ప్రభుత్వం మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంది. అయినప్పటికీ, ఫార్ములా మార్పు కోసం రైతులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంఎస్‌పీ సమస్య కొనసాగుతూనే ఉంది. రైతులకు రుణమాఫీ చేయాలని, విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ఢిల్లీ చలో 2.0' పేరుతో రెండోసారి నిరసనలు చెలరేగాయి. ఇదిలా ఉండగా, సోమవారం రెండు రైతు సంఘాలు... సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా తాము ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని ప్రకటించాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీని చేపట్టాలని కూడా రైతు సంఘాల నేతలు ప్రణాళిక చేస్తున్నారు. గణనీయమైన సంఖ్యలో రైతులు ఉన్న మహారాష్ట్ర, హర్యానా వంటి కీలక రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో సమస్య మరింత తీవ్రమైంది.

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

ఖాట్మండు: నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. టేకాఫ్ సమయంలో విమానం జారి పక్కనే ఉన్న గోతిలో పడిపోయింది. మంటలు చెలరేగి క్షణాల్లో అగ్నిగోళంగా మారింది. ఈ ఘటనలో 18 మంది దుర్మరణం చెందారు. ఒక్క పైలట్ మాత్రమే తప్పించుకోగలిగారు. ఫోఖారాకు బయల్దేరిన బాంబార్డియన్ సీఆర్‌జే 200 విమానం నేపాల్ రాజధాని ఖాట్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయ రన్‌వేపై నుంచి జారి పడింది. వెంటనే మంటలు చెలరేగి విమానం దగ్ధమైంది. ఈ ఘటన ఉదయం 11.15 గంటలప్పుడు జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో ఇద్దరు పైలట్లతో పాటు 17 మంది టెక్నీషియన్లు ఉన్నారు. వీరంతా సౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన సిబ్బంది. రంగంలోకి దిగిన పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. గాయపడిన పైలట్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు నేపాలీ పోలీసు అధికార ప్రతినిధి దాన్ బహదూర్ ఖార్కి తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం టీయూ టీచింగ్ హాస్పిటల్‌కు తరలించినట్లు వెల్లడించారు. ప్రమాణికులంతా నేపాలీలు కాగా యెమన్‌కు చెందిన ఒకరున్నట్లు తెలిపారు. పైకి ఎగిరే సమయంలో విమానం రెక్క రాపిడికి గురైందని, విమానం అదుపు తప్పి కింద పడి తగలబడిందని, అంతా రెప్పపాటులో జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ ప్రమాద వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. తాజా ఘటనపై విచారణకు నేపాల్ ప్రభుత్వం ఆదేశించింది.

ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటిపేజీ తరువాయి)

తంబిదురై, వీసీకే పార్టీ అధ్యక్షుడు (తమిళనాడు) తిరుమా వలవన్, ఆప్ నాయకులు రాజేంద్రప్రసాద్, శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ, తదితర పార్టీల నేతలు, ఎంపీలు విచ్చేసి జగన్‌కు మద్దతు తెలిపారు. గత 45 రోజుల నుంచి కూటమి ప్రభుత్వ హయాంలో కొనసాగుతున్న అరాచక చర్యలు, హత్యలు, దాడులు, బుల్డోజర్లతో ఇళ్ల కూల్చివేత, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసమైన సంఘటనలకు సంబంధించిన ఫొటో, వీడియో ప్రదర్శనలను ఆయన చూపించారు. ధర్నాకు ముందు జాతీయ మీడియాతో జగన్ మాట్లాడారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 45 రోజులుగా అరాచక, ఆటవిక పాలన కొనసాగుతోందని, అంతులేని దారుణాలు జరుగుతున్నాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని తెలిపారు. వైసీపీని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యం అయిందని, అందుకే హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. 30 మందికి పైగా హత్యలు జరిగాయని, 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయని వివరించారు. 560 చోట్లకు పైగా ప్రైవేట్ ఆస్తులు, 490 చోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారన్నారు. యథేచ్ఛగా 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు భారత రాజ్యాంగం కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగం పని చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో దారుణ పరిస్థితి గురించి తెలుసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో అండగా నిలవాలని ఆకాంక్షించారు.

బీజేపీ... నేరమయ సంఘటనలు సమర్థించొద్దు : ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

జగన్‌కు మద్దతు తెలిపిన అనంతరం అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ నేరమయ రాజకీయాలు చేయకూడదని, ఇలాంటి ఘటనలను సమర్థించొద్దు అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ సూచించారు. ఏపీలో బుల్డోజర్ సంస్కృతి దేనికి సందేశమని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బుల్డోజర్ సంస్కృతిని మా సమాజ్‌వాదీ పార్టీ ఏనాడూ సమర్థించలేదని, దాన్ని తప్పు పడుతున్నామని చెప్పారు. ఒకవేళ నన్ను జగన్ ఆహ్వానించి ఉండకపోయి ఉంటే, నేను ఇక్కడికి రాకుండా ఉండి ఉంటే... నాకు ఇన్ని వాస్తవాలు తెలిసి ఉండేది కాదని అన్నారు. పట్టపగలే దాడులు చేయడం, హత్య చేయడం, వారి ఆస్తులు ధ్వంసం చేయడం, ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా ఉన్న వారిపై అక్రమంగా కేసులు నమోదు చేయడం, వేధించడం, ఎన్నికయిన ప్రజాప్రతినిధులపై ఏకంగా హత్యాయత్నం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆమోదయోగ్యం కాదని ఖండించారు. జగన్‌కు మా మద్దతు ఉంటుందని, ఇలాంటి పరిస్థితి రేపు మరెవరికైనా జరగొచ్చు అని చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏపీలో జరుగుతున్న ఘటనలపై కేవలం దాడులు, దౌర్జన్యాల కోణంలోనే కాకుండా దేశ ద్రోహ కేసులు నమోదు చేయాలన్నారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకులు, రాజ్యసభ సభ్యులు రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంత దారుణం జరుగుతుంటే, రాజ్యాంగ వ్యవస్థ ఏమైంది?, గవర్నర్ ఏం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వీసీకే పార్టీ అధ్యక్షుడు (తమిళనాడు) తిరుమా వలవన్ మాట్లాడుతూ ఏపీలో టీడీపీ ముఖ్య నాయకుల ఆదేశాల మేరకే ఈ దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదొరై మాట్లాడుతూ ఏపీలో క్షీణించిన శాంతిభద్రతలపై కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

శివసేన (యూబీటీ) నాయకులు సంజయ్ రౌత్ మాట్లాడుతూ ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదన్నారు. వైసీపీ ఎంపీ గొల్ల బాబూరావు, నేతలు అంబటి రాంబాబు, సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. జగన్‌తో పాటు పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, ఆర్‌వీ కృష్ణయ్య యాదవ్, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు.

లెక్కలు తేలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్లనూ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఏ విధంగా ప్రక్షాళన చేయాలో శాసనసభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. మంత్రులంతా వారి శాఖల్లోని అవకతవకల్ని వెలికితీయాలని చంద్రబాబు సూచించారు.

మద్యం కుంభకోణానికి బాధ్యులను శిక్షించాలి: పవన్

ఎక్సైజ్‌శాఖకు సంబంధించి శ్వేతపత్రంలో చెప్పిన దానికంటే ఎక్కువ అక్రమాలే జరిగాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎక్సైజ్‌శాఖ శ్వేతపత్రంపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాకు ఈ శాఖ వల్ల రూ.18 వేల కోట్లు నష్టం జరిగిందని తెలిపారు. దీనికి కారకులైన వారిని కచ్చితంగా శిక్షించాలన్నారు. తప్పు చేసిన వారిని వదిలేస్తే భవిష్యత్తుకు ముప్పు ఏర్పడుతుందన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు కేంద్రం కేటాయిస్తే ఎంతో సంబరపడ్డాం. అదే ఎక్సైజ్‌శాఖ నుంచి ఖజానాకు రావాల్సిన రూ.18 వేల కోట్లు వచ్చుంటే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. రూ.20 వేలు లంచం తీసుకున్న ఓ సాధారణ ఉద్యోగిని శిక్షించగలుగుతున్నాం. ఇంత భారీ మొత్తంలో దోపిడీకి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదని పవన్ స్పష్టం చేశారు.

ఏమిటీ వివక్ష?

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ... ఎన్డీఏ సర్కారు కుర్చీ కాపాడుకునే బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడిచిందని విమర్శించారు. ఈ సందర్భంగా 'వియ్ వాంట్ ఇండియా బడ్జెట్ ఎన్డీఏ బడ్జెట్ కాదు', 'బడ్జెట్‌లో భారత్‌కు ఎన్డీఏ ద్రోహం' వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులను ఎంపీలు ప్రదర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం నిన్నటి బడ్జెట్ ద్వారా సమాఖ్య వ్యవస్థను పరిరక్షించే సూత్రాలన్నింటినీ ఉల్లంఘించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడమే బడ్జెట్ లక్ష్యమని కేవలం రెండు రాష్ట్రాల (ఏపీ, బీహార్)కే వరాలివ్వడానికి పరిమితమయ్యారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు నిధులు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదని, ఇతర రాష్ట్రాలకు కూడా న్యాయం జరగాలన్నారు. ప్రజల ఆందోళనకు గురవుతున్నారు కాబట్టే బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎస్పీ ఎంపీ జయా బచ్చన్ బడ్జెట్‌పై మండిపడ్డారు. యువతకు తప్పుడు హామీలు ఇచ్చారన్నారు. తమ రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌పై వివక్ష చూపారని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఉద్యోగాలు లాక్కొని ఇప్పుడు శిక్షణ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ... "బడ్జెట్‌తో దేశం మొత్తం కలత చెందింది. తమ ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో బిజెపి విఫలమైందని అన్ని రాష్ట్రాల ప్రజలు కలత చెందుతున్నారు. ప్రభుత్వ బలవంతం ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి నిరసన తెలుపుతోంది" అన్నారు. "మేము ఈరోజు పంజాబ్‌కు న్యాయం కోసం నిరసనలు చేస్తున్నాము. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు అన్నీ కేటాయించారు... పంజాబ్‌కు వరద సాయం కూడా ఇవ్వలేదు. పంజాబ్ బీజేపీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. అందుకే ఆ రాష్ట్రాన్ని విస్మరించారు' అని కాంగ్రెస్ ఎంపీ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ పేర్కొన్నారు. ఆర్ఎస్‌పి ఎంపీ ఎన్‌కే ప్రేమచంద్రన్ మాట్లాడుతూ... కొన్ని రాష్ట్రాలపై పూర్తి వివక్ష చూపారన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్‌లో ప్రోత్సాహాలు ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఉత్తరప్రదేశ్ పేరు కూడా బడ్జెట్‌లో లేదని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ నిరాశ వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు వారు కొందరికి నిధులు ఇస్తున్నారని, ఇతరులను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. 'మహారాష్ట్రను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు' అని రాసి ఉన్న ప్లకార్డును పట్టుకున్న శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్... బడ్జెట్‌ను కేవలం ఏపీ, బీహార్, ఒడిశా రాష్ట్రాలకు అనుకూలంగా అభివర్ణించారు.

"ఈ బడ్జెట్‌తో నితీశ్ కుమార్ ,చంద్రబాబు నాయుడు అనే ఇద్దరు వ్యక్తులు తప్ప దాదాపు అందరూ నిరాశ చెందారు. అన్ని ఆర్థిక నివేదికలు ఆదాయం పెరగడం లేదు కానీ దేశంలో ధరలు పెరుగుతున్నాయని తేల్చాయి. దేశంలోని పెట్టుబడిదారులను ప్రభుత్వం స్తంభింపజేసింది... ఈ బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాలను ఆగ్రహానికి గురి చేసింది... ఈ బడ్జెట్‌లో తీసుకొచ్చిన జరిమానా విధించే నిబంధనలకు స్వస్తి పలకాలి" అని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా అన్నారు. కాగా తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాల పట్ల వివక్షకు నిరసనగా రాబోయే నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు.

బడ్జెట్ కేటాయింపులపై నిరసన

కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపక్షాలు పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపడాన్ని నిరసిస్తూ ఇండియా ఐక్యసంఘటన ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. బుధవారం ఉదయం సభ సమావేశమైన వెంటనే బడ్జెట్ కేటాయింపుల అంశాన్ని లేవనెత్తేందుకు విపక్ష ఎంపీలు ప్రయత్నించారు. వివక్షాపూరిత బడ్జెట్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలకు అంతరాయం కలిగించవద్దని హెచ్చరించారు. ఇరుపక్షాల సభ్యులు పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించాలని ఆయన అన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం సభా కార్యక్రమాలు అడ్డుకుంటున్నారని ప్రతిపక్షాలను నిందించారు. కాగా పార్లమెంట్ భవనం మెట్లపై విపక్షాల నిరసన కారణంగా పార్లమెంటు హౌస్‌లోకి ప్రవేశించడానికి సభ్యులు ఇబ్బంది పడుతున్నారని స్పీకర్‌తో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ధ్వజమెత్తారు. తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కొంతమంది సభ్యులు తనకు లేఖలు రాశారని బిర్లా తెలిపారు. తమ సమస్యను లేవనెత్తేందుకు అనుమతి లేకపోవడంతో విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

ఎంత మంది పిల్లలున్నా...

(మొదటిపేజీ తరువాయి)

పునరుద్ధాటించారు. గతంలో చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

గత అమ్మఒడి పథకంలో ఈ పథకానికి అర్హతలను మార్చి వేశారని ఆరోపించారు. తన పాదయాత్రలో ద్విచక్ర వాహనాలు ఉన్న వారికి సైతం తెల్లకార్డులు రద్దయినట్లు తెలిపారని, వాటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని, తల్లికి వందనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. నాడు-నేడు, అమ్మఒడి, సీబీఎస్ఈ, ఐబీ లాంటి పథకాలను తీసుకువస్తే... ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు పిల్లలు తగ్గారో సమీక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యా రంగంపై ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

నీతి ఆయోగ్ భేటీ బహిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధరామయ్య, సుఖ్విందర్ సింగ్ సుకు, రేవంత్ రెడ్డి కూడా నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తారని పేర్కొన్నారు. రాజ్యాంగ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రభుత్వ వైఖరి ఉన్నట్లు వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా తమ నిర్ణయాన్ని ప్రకటించారు.

మంగళవారం సాయంత్రం ఇండియా ఐక్య సంఘటన సమావేశంలో నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించాలన్న అంశం చర్చకు వచ్చింది. స్టాలిన్ నిర్ణయంతో మిగతా నాయకులు ఏకీభవించారు. దీంతో నీతి అయోగ్ సమావేశాన్ని ఐక్యంగా బహిష్కరించాలని నిర్ణయించారు.

నిరుద్యోగుల నెత్తిన కడివెడు నీళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించే యాజమాన్యాలకు నెల నెలా రూ.3,000 చెల్లిస్తారు. ఇది భవిష్య నిధికోసం యాజమాన్యం చెల్లించవలసిన మొత్తానికి పరిహారం అన్నమాట. ఈ త్రిసూత్ర పథకంలో రెండు అంశాలు యాజమాన్యాలకు ఉపకరించేవే. అసలు మొదటిసారి ఉద్యోగాలకు ఏ రంగంలో ఎలా అవకాశం ఉంటుందో ఆర్థికమంత్రి సమాధానం చెప్పలేదు. ఈ సదుపాయాలన్నీ ఉద్యోగాలు వస్తే గిస్తే మాట. ఈ మూడు అంశాలను గమనిస్తే నిరుద్యోగ సమస్యకు రోగనిదానం సవ్యంగా ఉన్నా చికిత్స అపసవ్యంగా, అసమగ్రంగా, అపనమ్మకంగా ఉన్నట్టు తేలిపోతోంది. నిర్మలా సీతారామన్‌కు తట్టిన మరో ఆలోచన ఏమిటంటే అయిదేళ్ల కాలంలో రూ.60,000 కోట్లు ఖర్చు పెట్టి వెయ్యి పారిశ్రామిక శిక్షణా కేంద్రాల స్థాయి పెంచడం. ఇందులో సగం ఖర్చు కేంద్రం భరిస్తే...మిగతా సగం రాష్ట్రాలు భరించాలి. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధుల నుంచి కూడా కొంత భరించాలట. ఇంకో ప్రతిపాదన ఏమిటంటే 12 నెలలపాటు 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ (శిక్షణ). ఇది 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ శిక్షణకు అర్హులైన వారికి రూ.5,000 భత్యం, దీనికితోడు ఒకే మొత్తంగా రూ.6,000 అందజేస్తారు. ఈ పథకాలన్నింటిలో ప్రధాన లోపం కనిపించకుండా నిర్మలా సీతారామన్ జాగ్రత్త పడ్డారు. ఇవేవీ సబ్సిడీలు ఆగిపోయిన తరవాత సాగే అవకాశం లేదు. ఈ ప్రోత్సాహకాలకు భవిష్య నిధితో లంకె పెట్టినందువల్ల ఉద్యోగులను నియమించినట్టు నకిలీ జాబితాలు తయారు చేసినా అడిగే దిక్కుండదు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కోసం అయిదేళ్లలో రూ.రెండు లక్షల కోట్లు కేటాయిస్తారట. అంతమొత్తం ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం... గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిరోజులు పెంచొచ్చుగా! పెంచదు. ఎందుకటే ఆ పని చేసిందీ... లేనిదీ తెలుసుకునే అవకాశం కొంతైనా ఉంటుంది. వ్యవసాయరంగం నుంచి నిష్క్రమిస్తున్న వారికి ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు అవసరమవుతాయని ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. 2030 దాకా ఇదే పరిస్థితి ఉంటుంది.

ఇవన్నీ మోదీ సర్కారుకో, ఆయన నియమించుకున్న ఆర్థిక నిపుణులకో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కో తట్టిన మహత్తరమైన ఆలోచనలు ఏమీ కావు. ఈ అంశాలు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఉన్నాయి. వాటినే ఆర్థికమంత్రి తమ విధానాలుగా చెలామణి చేశారు. అదీ సంపూర్ణంగా కాదు. ఉపాధితో లంకె ఉన్న పథకాలు కాంగ్రెస్ ప్రణాళిక నుంచి కాజేయడానికి మోదీ ప్రభుత్వ హృదయ వైశాల్యం, ఔదార్యం ఎంత మాత్రం కారణం కాదు. అవి బడ్జెట్ రూపకర్తలకు సరిగ్గా అర్థమైనట్టూ లేదు. ప్రోత్సాహకాలకు వర్తించే మార్గదర్శకాలు చూస్తే కార్పొరేట్ సంస్థలు జడుసుకుని పారిపోయే పరిస్థితి ఉండొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యను తీర్చాల్సిన బాధ్యత ఆ దేశ ప్రభుత్వాలదే. కేవలం పరిపాలనతో ప్రభుత్వ బాధ్యత తీరదు. ఉపాధికి సిద్ధంగా ఉన్నవారందరికీ పని చూపించాల్సింది ప్రభుత్వమే. అందుకే నిరుద్యోగం తాండవించే దేశాలలో ప్రభుత్వాలు విమర్శకు గురవుతూ ఉంటాయి. ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రభుత్వ వ్యయం పెరగాలి. కానీ మోదీ హయాంలో ప్రభుత్వ వ్యయం కుంచించుకు పోతోంది. 'మేక్ ఇన్ ఇండియా' గురించి ఆ పేరు కనిపెట్టిన మోదీనే మాట్లాడటం లేదు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మూసేయడం మీద మోదీకి ఉన్న దృష్టి కొత్త ప్రభుత్వ రంగ సంస్థలు స్థాపించడం మీద బొత్తిగా లేదు. ఆయన పదేళ్ల పరిపాలనలో ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమ కూడా ఏర్పడలేదు. ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడులు ఉపసంహరించడానికి వాజ్‌పేయి ప్రభుత్వంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేశారు. మోదీ హయాంలో దానికి 'మానిటైజేషన్' (ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ పెట్టుబడిని నగదుగా మార్చుకోవడం) అని కొత్త పేరు పెట్టారు. నగదు కింద మార్చడం అంటే అయిన కాడికి కావలసిన వారికి అప్పగించడమే.

ఈ ఏడాది అభివృద్ధి రేటు 7.2 శాతం దాకా ఉంటుందంటున్నారు. కానీ అభివృద్ధి ఉద్యోగ కల్పనకు తోడ్పడడం లేదు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం జనాన్ని విపరీతంగా కలవర పెడుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం మన దేశంలో నిరుద్యోగం 3.2 శాతమే. కానీ ఇవి ఒట్టి కాకిలెక్కలని అనేక స్వతంత్ర సంస్థల గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ సంస్థల లెక్క ప్రకారం నిరుద్యోగం 9.2 శాతం ఉంది. ఇటీవలి కాలంలో స్వయం ఉపాధే ప్రధాన ఉపాధి కల్పనా మార్గం అవుతోంది. 2022 అంచనాల ప్రకారం స్వయం ఉపాధి చూసుకున్న వారు మొత్తం పని చేసే వారిలో 56 శాతం ఉన్నారు. పని అంటూ ఉన్నా అవ్యవస్థీకృత రంగంలో పని చేసే వారు 82 శాతం ఉంటారు. నికర వేతనమో, కూలీనో అందుకునే వారు కేవలం అయిదింట ఒక్కరు మాత్రమే. వస్తూత్పత్తి రంగంలో ఉపాధి అవకాశాలు కరోనాకు ముందుకన్నా 11.4 శాతం తగ్గాయి. నిరుద్యోగుల్లో 83 శాతం యువతే. మూడు నెలలపాటు రూ.5,000 చెల్లిస్తామనడం అర్థరహితం. ప్రభుత్వం బొత్తిగా ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదు. భారత ఆర్థిక వ్యవస్థ అసలు సమస్య గిరాకీ లేకపోవడం. బడా కంపెనీలే కాక ఎంఎస్ఎంఈలు కూడా పెట్టుబడులు పెట్టడం లేదు. అంటే ఉద్యోగాలు కల్పించే వీలు లేదు. జనం దగ్గర డబ్బులు లేకపోతే డిమాండు ఉండదు. ఇది ఓ విష వలయం. ఈ గోడు కేంద్ర ఆర్థిక మంత్రికి పట్టిన దాఖలాలే లేవు. ఆమె అభ్యసించిన ఆర్థికశాస్త్రంలో వీటికి సమాధానాలు ఉండొచ్చు. కానీ ఆచరించే రాజకీయాలు ఆమెకు ఆ సమాధానాల వేపు చూసే అవకాశమే ఇవ్వవు.

పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్లకు 31న స్పాట్ అడ్మిషన్లు

విశాలాంధ్ర-విజయవాడ: పాలిసెట్ తుది దశ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్లను 'స్పాట్ అడ్మిషన్' ద్వారా భర్తీ చేస్తామని సాంకేతిక విద్యాశాఖ సంచాలకుడు, అడ్మిషన్ల కన్వీనర్ గుమ్మల గణేశ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేస్తారన్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల కోసం సంబంధిత పాలిటెక్నిక్ ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను శాఖలు, విభాగాలవారీగా ఈనెల 27న నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత రుసుముతో ఈనెల 31న విద్యార్థులు పాలిటెక్నిక్‌లకు హాజరు కావాలన్నారు. కౌన్సెలింగ్ ద్వారా కేటాయింపు పొందిన, కోర్సులో ప్రవేశం తీసుకున్న అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్‌కు అర్హులు కాబోరని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందితే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులవుతారని గణేశ్‌కుమార్ అన్నారు.

కార్మికవర్గంపై బీజేపీ దాడులు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-బి.కొత్తకోట: దేశంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మిక వర్గంపై పెద్ద ఎత్తున దాడులకు పూనుకుందని, కార్మికులు అనేక పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తూ, ప్రజాధనాన్ని లూటీ చేసి కార్పొరేట్లకు పంచిపెడుతున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. బుధవారం హార్సిలీ హిల్స్‌లో రెండు రోజుల పాటు జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ వికసిత భారత్ 2024-2025 బడ్జెట్ దేశాభివృద్ధికి తోడ్పడుతుందని ముందుగానే మీడియాలో కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసిందని, తీరా చూస్తే కార్మిక వర్గానికి నిరాశ కలిగించిందని తెలిపారు. ఈ బడ్జెట్ వలన ప్రైవేటీకరణ తీవ్రం అవుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమిస్తూ ప్రతిపాదన చేయలేదని విమర్శించారు. దేశ అభివృద్ధికి ఉపయోగపడే విద్య, వైద్యంపై బడ్జెట్ పెంచలేదన్నారు. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు అనేక ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొనడం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదన్నారు. 15 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ఇస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. మునిసిపల్ కార్మికుల గత సమ్మె కాలపు హామీలు నెరవేర్చాలని, తమ సమస్యలను పరిష్కరించుకునే దిశగా మున్సిపల్ కార్మికులు ఉద్యమానికి సిద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులు రామారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు తులసేంద్ర, రామచంద్రయ్య, ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవి, ఉపాధ్యక్షుడు రాజేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల దోపిడీ అరికట్టండి

రవాణా మంత్రికి ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రైవేట్ బస్సుల దోపిడీని అరికట్టాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య బుధవారం రవాణా మంత్రి ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డికి లేఖ రాశారు. డిమాండ్‌ను బట్టి టికెట్ల ధరలు పెంచేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రవాణా శాఖ అనుమతులు లేనప్పటికీ అనేక సర్వీసులు నడుస్తున్నాయని, తనిఖీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉదాహరణకు కడప నుంచి విజయవాడకు ప్రైవేట్ బస్సులో రావాలంటే టికెట్ ధర రూ.1900గా ఉంటుందని, అదే వారాంతం లేక పండుగులప్పుడు ధర రూ.2వేలకు పైమాటేనని మంత్రికి ఈశ్వరయ్య తెలిపారు. పండుగ సీజన్లలో చార్జీలు పెంచడం గతంలోనూ ఉన్నప్పటికీ... ప్రస్తుతం రద్దీని బట్టి టికెట్ ధరలు ఉంటున్నాయన్నారు. ఒక్క కడప -విజయవాడ మధ్యనే కాక రాష్ట్రమంతటా ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ సాగుతోందని తెలిపారు. వరుసగా రెండు, మూడు రోజులు సెలవులొస్తే విజయవాడ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే వారి దృష్ట్యా చార్జీలు పెంచేస్తుండటంతో, ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతోందన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీని అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డిని ఈశ్వరయ్య కోరారు.

బడ్జెట్‌లో కౌలు రైతులకు మొండిచేయి

ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో కౌలు రైతులకు మొండి చేయి చూపారని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కౌలు రైతులకు పంట రుణాలు మంజూరు విషయంలోను, తీసుకున్న రుణాలకు వడ్డీరాయితీ కల్పించడలోను, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరుతున్నప్పటికీ స్పందించకపోవడం దుర్మార్గమని తెలిపారు. సాగులో ఉన్న కౌలు రైతుల దామాషాను అనుసరించి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 50 శాతం కౌలు రైతులే అన్ని రకాల పంటలను పండిస్తున్నారని వివరించారు. పంట రుణాలకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ అందటం లేదని, ప్రకృతి విపత్తులు, చీడపీడలు ప్రజలు వచ్చి పంటలు నష్టపోతే పరిహారం కూడా వారికి దక్కడం లేదని పేర్కొన్నారు. 2016లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోడల్ కౌలు చట్టం రాష్ట్రంలోని కౌలు రైతులకు శాపంగా మారిందని, గుర్తింపు కార్డులు జారీ చేసే విషయంలో ఆ చట్టమే పెద్ద ఆటంకమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర సమగ్రమైన కౌలు విధానం లేకపోవడం చేత పంటల బీమా పథకం కౌలు రైతులకు వర్తింపజేయడం లేదన్నారు. ఇప్పటికైనా కౌలు రైతులు సాగు చేస్తున్న భూమి దామాషా ప్రకారం పంట రుణాలు, పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా పరిహారాలు, వ్యవసాయ పరికరాలు తదితర సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యోగి వేమన వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ కృష్ణారెడ్డిని తొలగించండి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణా రెడ్డిని యోగి వేమన యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా నియమించడం సిగ్గుచేటని, తక్షణమే ఆయనను పదవి నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వీ జాన్సన్ బాబు, కే శివారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం దాసరి భవన్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం మాట్లాడుతూ కృష్ణారెడ్డి గతంలో కృష్ణా వర్సిటీలో రిజిస్ట్రార్‌గా రెండు సంవత్సరాలు మాత్రమే పనిచేశారని, ఉద్యోగినులు, విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని అందిన ఫిర్యాదుపై ప్రభుత్వం కమిటీ వేసి ఏడాదిన్నర కాలంలోనే ఆయనను సస్పెండ్ చేసిందని తెలిపారు. యోగి వేమన యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా ఉండి తన వైఖరి మార్చుకోకుండా ఇదే పద్ధతుల్లో వ్యవహరించిన తీరును గుర్తు చేశారు. కమిటీ వేసి విచారణలో ఆరోపణలు వాస్తవాలు పరిశీలించి ప్రిన్సిపాల్‌గా తొలిగించారన్నారు. ఇలాంటి కామపిశాచిని ఇన్‌ఛార్జి వీసీగా ఏ విలువలతో నియమించిందో విద్యాశాఖ సమాధానం చెప్పాలని అన్నారు. విలువలతో కూడిన సంక్షేమ ప్రభుత్వమని ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. యూనివర్సిటీ విలువలను, వీసీ కుర్చీతో ప్రతిష్టను పెంచాలని కోరారు. వెంటనే ప్రభుత్వం, ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్ నియామకాన్ని వెనక్కి తీసుకోకపోతే గవర్నర్ దృష్టి కి కూడా తీసుకు వెళ్తామని హెచ్చరించారు. కృష్ణారెడ్డిని తొలగించేవరకు పోరాటం చేస్తామన్నారు. జీవో 107, 108 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ వలరాజు, రాష్ట్ర కోశాధికారి మందగళ్ళ సాయికుమార్, రంజిత్, జగదీశ్, అయ్యప్ప, సురేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసి ఉద్యోగులకు పాత విధానంలోనే వైద్యసౌకర్యాలు కల్పించాలి

పలిశెట్టి దామోదరరావు

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉద్యోగులందరిలో ఉందని ఏపీపీటీడీ (ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ పశ్చిమగోదావరి జిల్లా కమిటీ అద్వర్యంలో తణుకు సీపీఐ కార్యాలయంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీసభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న దామోదరరావు మాట్లాడుతూ... ప్రభుత్వంలో విలీనం అనంతరం ఆర్టీసి ఉద్యోగులకు గత ప్రభుత్వంలో ఈహెచ్‌యస్ పథకం వర్తింప చేశారని, ఆర్టీసీ ద్వారా పొందే రిఫరల్ ఆసుపత్రుల వైద్యసౌకర్యాలను తొలగించారని చెప్పారు. దీంతో సరైన వైద్యసౌకర్యాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిరిగి పాతపద్ధతిలో వైద్య సౌకర్యాలు అందించేలా చర్యలు చేపట్టాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విలీనం పేరుతో ఆర్టీసి ఉద్యోగులుకు దశాబ్దాలుగా ఉన్న అలవెన్సులను, ఇన్సెంటివ్ స్కీమ్ లను గత ప్రభుత్వం ఏకపక్షంగా తొలగించిందన్నారు. వాటిని పునరుద్ధరించాలని కోరారు. గడచిన ఐదేళ్లలో కారుణ్య నియామకాలు తప్ప ఇతర నియామకాలే జరగలేదని, దీంతో కండక్టర్లు, డ్రైవర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది పోస్టులకు వేలసంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. వీటిని భర్తీచేయాలని పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ పోరాట ఫలితంగానే ఆర్టీసీ ప్రభుత్వ రంగసంస్థగా ఆవిర్భవించిందని, సమస్యలు పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని, కార్మిక సమస్యలు పరిష్కారానికి అంకితభావంతో పనిచేసే ఎంప్లాయీస్ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈయూ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగు కార్యదర్శి ఎండీఏ అలీ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న ప్రభుత్వం ఇచ్చిన హామీని విజయవంతం చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు. అయితే కొత్త బస్సులు కొనుగోలు చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. విజయవాడ జోన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు యం.యస్.రావు, వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన 2017 పీఆర్సీ అరియర్స్‌ను దశలవారీగా ఉద్యోగులందరికీ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలిన చెల్లింపులకోసం కృషిచేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఈయూ జిల్లా కార్యదర్శి అల్లం సత్యన్నారాయణ, జోన్, జిల్లా నాయకులు జిల్లాలో ఉన్న నాలుగు డిపోల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.

కులవివక్షపై గర్జించిన జాషువా కలం

సాహితీ దిగ్గజానికి డీహెచ్‌పీఎస్ ఘన నివాళి

విశాలాంధ్ర -తిరుపతి: సమాజంలో అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న కుల వివక్షతపై గుర్రం జాషువా తన కలం తో సమాధానం చెప్పారని ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు కీర్తించారు. తిరుపతి బైరాగి పట్టెడ లోని పిల్లపాలెం వాసుదేవరెడ్డి గ్రంథాలయంలో డీహెచ్‌పీఎస్ తిరుపతి జిల్లా సమితి అధ్వర్యాన బుధవారం తెలుగు సాహితీ దిగ్గజం గుర్రం జాషువా 53వ వర్ధంతి సభ నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షులు వీ నాగభూషణం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరవది సుబ్బారావు గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలు ఎదుర్కొంటున్న కుల వివక్షత పైన గుర్రం జాషువా తన కలం తో సమాధానం చెప్పారని కొనియాడారు. తన జీవితమంతా ఎన్ని కష్టాలు ఎదురైనా ఒడిదుడుకులు తట్టుకొని తన ఆశయాల సాధనకు కలాన్ని ఆయుధంగా చేసుకున్నారన్నారు. నాగేశ్వరావు మాట్లాడుతూ గుర్రం జాషువా గారి ఆశయాలను కొనసాగించడానికి, కార్యకర్తలు మేధావులు కృషి చేయాలన్నారు. అంజయ్య, ధన శేఖర్ , చిన్న పెంచలయ్య మాట్లాడుతూ కులమత అసమానతలకు వ్యతిరేకంగా నిరంతరం దోపిడీ లేని సమాజం కోసం మనం పోరాడినప్పుడే గుర్రం జాషువాకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ నాగరాజు వందన సమర్పణ గావించారు. సభలో తిరుపతి జిల్లా డీహెచ్‌పీఎస్ కార్యదర్శి చిన్నం కాలయ్య, నాయకులు పరమేశ్వరరావు, నడ్డి నారాయణ ,ప్రసాద్ రావు, దామోదరం, తులసి రామ్, డాక్టర్ బలరాం, ఎస్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు ఏపీ ప్రజానాట్యమండలి కళాకారులు నాగరాజు, సుబ్రహ్మణ్యం జాషువా పాటలు ఆలపించారు.

ఉపాధి కల్పనకు కొత్త పథకాల ఊసేలేదు

కేంద్ర బడ్జెట్‌పై ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి కల్పన కోసం కొత్త పథకాలు ప్రకటించకపోవడం యువతను నిరాశపర్చిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కి చట్టపరమైన హామీ కలగానే మిగిలిందన్నారు. విజయవాడ లోని హనుమాన్ పేట నందు దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ నిరుద్యోగులను మోసం చేసేదిగా ఉందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించే 'స్కిల్ ఇండియా' విఫలమైనట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయని చెప్పారు. 500 పరిశ్రమల్లో నాలుగు కోట్ల ఉద్యోగాలని ప్రకటించటం నిరుద్యోగులను మోసగించటమే అవుతుం దన్నారు. ప్రభుత్వ రంగాలలో 30 లక్షల ఖాళీల భర్తీ గురించి, రైల్వే భద్రత గురించి ప్రస్తావించలేదని, ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయనన్నారు. యువత, విద్యా రంగాలను నిరాశపర్చి, బాడా కార్పొరేట్లను సంతృప్తి పర్చేదిగా కేంద్ర బడ్జెట్ ఉందని రాజేంద్రబాబు విమర్శించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవింద రాజులు, నాయకులు శిగంశెట్టి మోహన్‌ప్రసాద్, హరీశ్, కార్తీక్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌లకు 'రెడ్ కార్పెట్'

పేద, మధ్యతరగతిని విస్మరించిన ఆర్థిక మంత్రి

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌లకు పెద్దపీట వేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మోదీ ప్రభుత్వం మరోసారి పేద, మధ్యతరగతి వర్గాలకు మొండిచేయి చూపిందని విమర్శించారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలను సంతోషపెట్టేలా బడ్జెట్ ఉందని, అనేక రంగాల పట్ల బడ్జెట్‌లో నిర్లక్ష్యం కనబడుతోందని తెలిపారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం స్వాగతించే విషయమైనా పోలవరం ప్రాజెక్టు అంశంలో స్పష్టత కొరవడిందని అన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్, కడప ఉక్కు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాలు లేకపోవడం విచారకరమని అన్నారు. హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, దీని కోసం డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నింగినంటిన ధరల నియంత్రణకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం శోచనీయమని అన్నారు. ఈ బడ్జెట్ యువత వ్యతిరేక బడ్జెట్‌లా కనబడుతుందని, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలిపోయిందని గుర్తుచేశారు. వ్యవసాయ రంగానికి తగిన విధంగా నిధులు కేటాయింపులు లేవని, వ్యవసాయ కార్మికులకు ఊరట కలిగించేలా బడ్జెట్ లేదని అన్నారు.

పారిశుద్ధ్య చర్యలు పట్టవా?

రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని జంగాల మండిపడ్డారు. రోజురోజుకు డెంగీ, అతిసార వంటి వ్యాధులు పెరిగిపోతున్నాయని, అనేక ఆసుపత్రులలో రోగుల పెరుగుదలను చూస్తే ఆందోళన కలుగుతుందని అన్నారు. పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సీపీఐగా తాము కోరామని, కానీ అది ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. అదేవిధంగా రైతాంగానికి పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు తక్షణమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, షేక్ వలి, బందెల నాసర్ జీ, జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పొట్టకొట్టే జీవో 217 రద్దు

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మత్స్యకారుల పొట్టకొట్టేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 217ను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాలలో భాగంగా బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న అనేక మందిలో మత్స్యకారులు ప్రధానమని, అటువంటి వృత్తిదారులను గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గపు నిర్ణయాలతో ఇబ్బందులు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉండడం మనకున్న మంచి అవకాశమన్నారు. రాష్ట్రంలో 3,325 చిన్న తరహా సాగునీటి చెరువులు, 23,920 గ్రామ పంచాయతీ చెరువులు, 118 రిజర్వాయర్లు ఉన్నాయని, స్వర్గీయ ఎన్టీఆర్ ఈ చెరువులను మత్స్యకారుల సొసైటీలకు ఇచ్చి వారి జీవన విధానం మెరుగుపరిచారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం జీవో 217 తెచ్చి మత్స్యకారుల సొసైటీల పరిధిలో ఉన్న చెరువులను ఆన్‌లైన్ టెండర్ల ద్వారా వైసీపీ కార్యకర్తలకు అప్పగించి మత్స్యకారుల పొట్ట కొట్టిందన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటివి ఇంకా ఎన్నో ఉన్నాయన్నారు. మత్స్యకారుల మెడకు ఉరి తాడు వేసిన జగన్ రెడ్డి తెచ్చిన జీవో 217ని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, మత్స్య కారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని మంత్రి సభాముఖంగా హామీ ఇచ్చారు.

జూట్ కార్మికుల ఆకలి కేకలు

- నెలరోజులుగా పస్తులుంటున్న వైనం
- తెరుచుకోని నెల్లిమర్ల జూట్‌మిల్
- స్పందించని యాజమాన్యం



విశాలాంధ్ర-నెల్లిమర్ల: విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల జూట్‌మిల్ మూతబడింది. ముడిసరకు కొరత కారణంగా రెండు వారాలు మూసివేస్తామని చెప్పిన యాజమాన్యం పూర్తిగా మూసివేసింది.నెలరోజులుగా మిల్లు తెరవకపోవడంతో కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. సీజన్‌లో మిల్లును నడిపించి... సీజన్ లేనప్పుడు మిల్లు మూసివేయడంతో కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారు. జూన్ 29న ముడిసరకు కొరత, ఆర్డర్లు లేవని చెబుతూ... రెండువారాలు తాత్కాలికంగా మిల్లును మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. మిల్లు ఎప్పుడు తెరిచేది ఈనెల 13న నోటీసు బోర్డులో తెలియజేస్తామని చెప్పి ఇంతవరకూ ఏ ప్రకటన చేయలేదు. యాజమాన్యం నాలుగు వారాలుగా కార్మికులకు పనిచెప్పకుండా ఖాళీగా ఉంచింది. ఇలాగే గతంలో కూడా మిల్లును తరచూ మూసివేయడంతో కార్మికులు ఆందోళన గురవుతున్నారు. ఇంతవరకూ మిల్లు తెరవకపోవడంతో పనిలేక, వేరేపనికి వెళ్లలేక కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నారు. జూట్ మిల్ లో 1550 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 400 మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా మరో 1200 మంది ఉద్యోగవిరమణ చేసినా.. యాజమాన్యం గ్రాట్యూటీ చెల్లింపులు చేయకపోవడంతో విధుల్లో కొనసాగుతున్నారు. ఇంకా 200 మంది బదిలీ కార్మికులు, మరో 350 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. తరచూ మిల్లును మూసివేయడంతో కార్మికులు అర్ధ ఆకలితో అలమటిస్తున్నారు. కొన్నేళ్లుగా యాజమాన్యం ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల రిటైర్డ్ కార్మికులకు పింఛను సదుపాయం అందడం లేదు. 2016 నుంచి గ్రాట్యుటీ బకాయిలు కూడా ఉండిపోయాయని ఇప్పుడు ఏకంగా లాకౌట్ చేశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి చొరవతీసుకుని మిల్‌ను తెరిపించాలని, తమకు ఉపాధి కల్పించాలని ఉద్యోగులు, కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జూట్ మిల్లును తక్షణమే తెరిపించాలి

జూట్ మిల్లు మూతపడటంతో వందలాది కార్మిక కుటుంబాలకు పూటగడవని పరిస్థితి ఏర్పడిందని ఏఐటియుసి నాయకులు మొయిద పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బేషరతుగా జూట్ మిల్లును తెరిపించి... కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛాంధ్ర గుర్తింపు సాధనే లక్ష్యం

పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ: స్వచ్ఛాంధ్ర గుర్తింపు సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి తగిన ఫలితాలను రాబట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యాదర్శి శశిభూషణ్ కుమార్ అధికారులను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని చెప్పారు. సచివాలయంలో బుధవారం ఓడీఎఫ్, మొబైల్ ఆప్లికేషన్, సర్వే తదితర అంశాలపై ఆన్‌లైన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు. కొన్ని గ్రామాల్లో ఇంకా బహిరంగ మలవిసర్జన చేస్తున్న సందర్భాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోందని, దీనికి శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. విభిన్న పథకాల కింద దాదాపు 80 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని, ఫలితంగా 2018లోనే రాష్ట్రం వందశాతం బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా నిలించిందని గుర్తు చేశారు. ఆ ఖ్యాతిని నిలబెట్టు కోవాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఎండి గంధం చంద్రుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి తడి పొడి చెత్త విభజన ఇప్పటికీ ప్రధాన సమస్యగా ఉందన్నారు. వ్యర్థాల నిర్వహణ యూనిట్లు వివిధ కారణాలతో పనిచేయని విషయాన్ని గుర్తించామని, వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేయాల్సి ఉందన్నారు. గ్రామ స్థాయిలో మురుగు నీటి నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయడానికి ప్రాథమిక అధ్యయనం అవసరమన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకులు వీఆర్ కృష్ణతేజ మైలవరపు మాట్లాడుతూ "స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడానికి సమగ్ర డేటా బేస్ అవసర మని, దీనిపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ రాజ్, గ్రామీణ మురుగునీటి పారుదల ఇంజనీర్లు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో గ్రామ స్థాయి, గృహ స్థాయి సర్వే నిర్వహిం చాలన్నారు. గ్రామీణ మురుగునీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ హోదాల అధికారులు, సిబ్బంది ఈ సమీక్షలో పాల్గొన్నారు.

సంపాదకీయం

ఉద్యోగులను విభజించే కుట్ర

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కార్యకలాపాలలో ప్రభుత్వోద్యోగులు భాగస్వామ్యం కావడంపై దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరో వినాశకర నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. నిషేధాన్ని ఎత్తివేస్తూ భారత ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరి విమల్ జులై9వ తేదీన జారీ చేసిన ఆదేశాలు సోమవారం వెలుగులోకి వచ్చాయి. మోదీ ప్రభుత్వ తాజా నిర్ణయం తీవ్ర రాజకీయ ప్రకంపనలకు దారితీసింది. 1966 నవంబరు 30, 1970 జులై 25, 1980 అక్టోబరు 28 తేదీలలో ఇచ్చిన ఆదేశాలలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రస్తావనను తొలగించాలని నిర్ణయించినట్టు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రభుత్వోద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలలో పాల్గొనడంపై 58 ఏళ్ల క్రితం అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని తొలగిస్తూ ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేయగా, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తెగసంబర పడిపోతున్నాయి. ఇందిరాగాంధీ ప్రభుత్వం జారీ చేసిన రాజ్యాంగవిరుద్ధ ఆదేశాలను మోదీ ప్రభుత్వం ఉపసం హరించుకున్నదని బీజేపీ నేత అమిత్ మాల్వియా వ్యాఖ్యానించారు. 1948జనవరి 30న జాతిపిత మహాత్మా గాంధీ హత్య తరువాత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించారు. సత్ప్రవర్తనతో మెలగుతానని ఆర్‌ఎస్‌ఎస్ హామీ ఇవ్వడంతో ఆ తరువాత నిషేధాన్ని ఎత్తివేశారు. తదనంతరమూ ఆర్‌ఎస్‌ఎస్ ధోరణిలో మార్పులేదు. కేంద్ర కార్యాలయం ఉన్న నాగపూర్‌లో ఎన్నడూ జాతీయ పతాకాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఆవిష్కరించలేదు. జాతివ్యతిరేక చర్యలు కొనసాగించడంతో 1966లో ఆరెస్సెస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు చేరడంపై ప్రభుత్వం నిషేధించింది. ఆర్‌ఎస్‌ఎస్, జమాత్-ఇ-ఇస్లామీ ప్రభుత్వోద్యోగులు పాల్గొనడంపై 1966లో ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఆరెస్సెస్ మాతృ సంస్థ. కేంద్రంలో బీజేపీ విజయం సాధించడంలో ఆరెస్సెస్ పాత్ర ఎంతో ఉందనేది దేశం మొత్తం తెలిసిన విషయమే. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 400 సీట్లలో విజయం సాధిస్తామని బీరాలు పలికిన బీజేపీ మెజారిటీ మార్కును కూడా అందుకోలేకపోవడంతో ఆరెస్సెస్ నేతలు నరేంద్ర మోదీపై, బీజేపీపై బహిరంగంగానే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. అహంకారంతోనే భారీగా సీట్లు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ఫలితాలు వెల్లడైన తర్వాత ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్‌లో ప్రచురితమైన ఒక వ్యాసం తీవ్ర దుమారానికి కారణం అయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీ కార్యకర్తల అతి విశ్వాసాన్ని కళ్లకు కట్టాయనీ, వారితోపాటు నేతలంతా గాలి బుడగను నమ్ముకుని పని చేశారని అందులో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపైనే ఆధారపడ్డారని.. ప్రజల గొంతుకలు వినలేదని ఆ వ్యాసం వెల్లడించింది. నిజమైన సేవకుడు అహంకారం కలిగి ఉండడనీ ఇతరులకు ఎలాంటి హాని కలిగించకుండా పని చేస్తాడని ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కోపాగ్నిని చల్లార్చేందుకు మోదీ నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గుట్టుచప్పుడు కాకుండా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వోద్యోగులు పాల్గొనడంపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఈ విధమైన ఉత్తర్వులు జారీచేయడం ద్వారా సైద్ధాంతిక ప్రాతిపదికన ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులతో రాజకీయాలు చేసే కుట్రకు ప్రధాని మోదీ తెరలేపారు. ప్రభుత్వోద్యోగుల తటస్థ భావనకు, రాజ్యాంగ ఔన్నత్యానికి ఈ చర్య తీవ్ర సవాలుగా పరిణమిస్తుందనడంలో అనుమానమేలేదు. 1966 తరువాత వచ్చిన ప్రభుత్వాలేవీ కూడా ఈ నిషేధాన్ని ఎత్తివేయనప్పుడు నేడు ఆ అవసరం ఎందుకు వచ్చిందో మోదీ ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో కూడా ఈ నిషేధం ఎత్తివేయడానికి సాహసించలేదు. ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉపయోగించుకుని రాజ్యాంగ బద్ధ, స్వయం ప్రతిపత్తి గల సంస్థలను సంస్థాగతంగా స్వాధీనం చేసుకున్న కాషాయ పార్టీ ఇప్పటికే రాజ్యాంగ సంస్థలను ధ్వంసంచేసిన విషయం జగద్విదితమే. రాజ్యాంగాన్ని మార్చాలన్న తన కుటిల ఉద్దేశాన్ని ప్రజలు తిప్పికొట్టినందువల్లే మోదీ ప్రభుత్వం తాజా చర్య తీసుకున్నదన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసమే గత ప్రభుత్వాలు నిషేధం అమలుచేశాయన్న ఆర్‌ఎస్‌ఎస్ వాదనలో పసలేదు. నిషేధం ఎత్తివేతతో దేశంలో ప్రజాస్వామ్యం మరింత పటిష్టమంతం అవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. కేంద్రం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందని కితాబిచ్చింది. రాజకీయ కారణాలతోనే 1966లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం విధించిందన్న కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ వ్యాఖ్యలు సత్యదూరం. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయవాద సంస్థ అనీ, దాని సభ్యులు దేశభక్తులని ఆయన కితాబిచ్చారు. ప్రతిపక్షాలవి బుజ్జగింపు రాజకీయాలని, హిందూ వ్యతిరేక వైఖరి అని గోయెల్ విరుచుకుపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ లాంటి అతి జాతీయవాద సంస్థలపై కాంగ్రెస్ మొదటి నుంచి వ్యతిరేక భావంతో ఉన్నదనీ, దేశంలో అలాంటి ఆలోచనలకు తావులేదన్న గోయెల్ వ్యాఖ్యలు విచారకరం. ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కచ్చితంగా ఉద్యోగులను విభజించే కుట్రే. ఇందులో ఎటువంటి అనుమానంలేదు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులను మంచి చేసుకునేందుకు మోదీ ప్రభుత్వం ఈ చర్య తీసుకుందన్న బీఎస్‌పీ అధినేత్రి మాయావతి వ్యాఖ్యల్లో నిజంలేకపోలేదు. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ వ్యాఖ్యానించినట్టుగా మోదీ పాలనలో ప్రభుత్వోద్యోగులు ఇకపై నిక్కర్లతో కనిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రభుత్వోద్యోగులతో రాజకీయాలు చేసే మోదీ ప్రభుత్వ ఈ విధమైన కుట్రను ప్రతిపక్షాలు, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఐక్యతతో నిలిచి తిప్పికొట్టాలి. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తూనే ఉండాలి.

మోదీని సవాలు చేస్తున్న యోగి

అజయ్ మోహన్ సింగ్ బిష్త్ అంటే గుర్తుపట్టేవారు తక్కువ మందే. కానీ యోగీ ఆదిత్యనాథ్ అంటే అందరూ గుర్తు పడ్తారు. ముఖ్యమంత్రుల్లో కెల్లా మేటి అని పొగిడేవారూ ఉంటారు. ఉత్తరప్రదేశ్‌లో వరసగా ముఖ్యమంత్రి అయిన వ్యక్తి ఆయన ఒక్కరే. ఏడేళ్ల పై నుంచి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ మధ్యకాలంలో యోగీ మీద సొంత పార్టీలోనే కాదు, ఉపముఖ్య మంత్రులు సైతం ఫిర్యాదు చేస్తున్నారు. కేంద్రమంత్రి అనుప్రియ పటేల్, సంజయ్ నిషాద్ కూడా తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యకు ముఖ్యమంత్రి పదవిమీద ఆశ ఉండడం అర్థం చేసుకోవచ్చు. ఉప ముఖ్యమంత్రి దినేశ్‌శర్మ కూడా మంత్రివర్గ సమావేశానికి హాజరు కాలేదు. ఈ రకంగా వారు నిరసన తెలియజేశారు. యోగీ ఆదిత్యనాథ్ ఆర్.ఎస్.ఎస్. కుదురు నుంచి రాకపోయినా మోదీకన్నా పెద్ద హిందుత్వవాదిని అని చెప్పుకోవడానికి అమితంగా ప్రయత్నించారు. యు.పి.లో ఉండాలంటే యోగి యోగి అనాల్సిందేనని ఆయన వందిమాగధులు నినదిస్తూ ఉంటారు. యోగీ చుట్టూ చేరి భజన చేసేవారు ఎంతమంది ఉంటారో వ్యతిరేకించేవారూ అంతేమంది ఉంటారు. మెరుగైన ముఖ్యమంత్రి అన్న భ్రమ చాలామందిలో ఉన్నందువల్ల యోగీ

ఆదిత్యనాథ్‌లో అహంభావం తారస్థాయికి చేరింది. లోకసభ ఎన్నికలలో బీజేపీ ఘోర పరాజయానికి కారణాలను సమీక్షించడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో యోగీ మోదీ-అమిత్ షా మీద యోగి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "మోదీలో అహంకారం పెరిగిపోవడమే ఓటమికి కారణం" అన్న అర్థమొచ్చే మాటలు కూడా మాట్లాడారు. యోగీ అహంకారం ఎక్కువో, మోదీ అహంకారం ఎక్కువో తేలాల్సి ఉంది. యోగీ ఆదిత్యనాథ్ 2017 మార్చిలో ముఖ్యమంత్రి కావడమే ఆశ్చర్యం. ఎందుకంటే ఆయన ఎంత కరడుగట్టిన హిందుత్వవాది అయినా ఆర్.ఎస్.ఎస్. కుదురునుంచి వచ్చినవారు కాదు. ముఖ్యమంత్రి కాక ముందు బీజేపీతో ఆయనకు చెప్పుకోదగ్గ సాన్నిహిత్యమూ లేదు. మొదటి సారి 26వ ఏట గోరఖ్‌పూర్ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై వరసగా గెలుస్తూ 2017 దాకా కొనసాగారు. 2017 ఎన్నికలలో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల రంగంలోకి దిగింది. మోదీ-షా ద్వయం అమాంతం యోగీ ఆదిత్యనాథ్‌ను ముఖ్యమంత్రి స్థానంలో ప్రతిష్ఠించింది.

ఆర్.ఎస్.ఎస్. కుదురుకు చెందినవారు కాకపోవడంవల్లనేమో యోగీ అధిష్ఠానం ఆజ్ఞలను తు.చ. తప్పకుండా అమలుచేసే స్వభావం ఉన్నవారు కాదు. ముఖ్యమంత్రి అయిన దగ్గరనుంచి ఆయన దాదాపు నిరంకుశంగానే ప్రవర్తిస్తున్నారు. బీజేపీ శాసనసభ్యులను కూడా ఖాతరు చేయరు. ఇక కార్యకర్తలకు ఆయన దర్శనభాగ్యం లభించడమే దుర్లభం. ఆయన నిరంకుశ స్వభావం 2021లో కరోనా పంజా విసిరినప్పుడు స్పష్టమైంది. యోగీ ఆదిత్యనాథ్ ఒంటెత్తుపోకడ అనుసరించారు. గంగానదిలో కరోనా మృతుల శవాలు తేలియాడినా, ఆసుపత్రులలో ఆక్సిజన్ కొరత ఉన్నా, ప్రభుత్వ నిర్వాకంపై దుమారంరేగినా యోగి ఆత్మస్తుతిలోనే మునిగి పోయారు. యోగీ అధికారవర్గం మీదే ఎక్కువ ఆధారపడతారు. యోగీలో ఉన్న ఈ అహంభావ ధోరణిని కనిపెట్టిన మోదీ గుజరాత్‌లో ఐ.ఎ.ఎస్. అధికారిగా పనిచేసిన అరవింద్ కుమార్ శర్మతో రాజీనామా చేయించి ఉత్తరప్రదేశ్‌కు పంపించారు. శర్మను ఉపముఖ్యమంత్రిని చేయాలన్నది మోదీ ఆలోచన. కానీ చాలా రోజులు యోగీ సదరు శర్మతో మాట్లాడడానికి కూడా ఒప్పుకోలేదు. ఉప ముఖ్యమంత్రిని చేయనూ లేదు. తనను కట్టడిచేయడానికే శర్మను పంపించారని తెలుసుకోలేనంతటి అమాయకుడు యోగీ కాదుగా! యోగీ నడవడిక ఎలా ఉంటుందంటే ప్రధానమంత్రి స్థానానికి మోదీ తరవాత తానే వారసుడినన్న అభిప్రాయం కలిగిస్తూ ఉంటారు. కానీ మోదీ అధికారం వదుకోవల్సివస్తే సాటి గుజరాతీ అయిన అమిత్ షానే ప్రధానమంత్రిని చేయడానికి ప్రయత్నిస్తారు. లోక్‌సభ ఎన్నికలలో యు.పి.లో బీజేపీకి ఘోరంగా బలహీనపడడంతో పాటు దేశవ్యాప్తంగా మెజారిటీ సాధించలేక పోయింది. మోదీ స్థానంలో ఎప్పుడో ఒకప్పుడు మరో నాయకుడిని ఆ స్థానంలో నియమిస్తారన్న ఊహాగానాలు సాగుతూనే ఉన్నాయి. ఈ కారణంవల్లే యోగీ దూకుడుగా ప్రవర్తిస్తూ ఉండొచ్చు. యోగీ ఎంత హిందుత్వవాది అయినా రామమందిర నిర్మాణం, రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దు, ముమ్మారు తలాఖ్ విధానానికి చెల్లు చీటీలాంటివన్నీ మోదీ ఖాతాలోనే ఉన్నాయి. హిందూరాష్ట్ర ఏర్పాటుకు ఇవన్నీ సోపానాలు అని ఆర్.ఎస్.ఎస్. భావించడంలో ఆశ్చర్యం లేదు. ఈ దృష్టితో చూసినా యోగీని ప్రధానమంత్రిగా ఆర్.ఎస్.ఎస్. అంగీకరిస్తుందన్న నమ్మకం లేదు. మోదీ సూత్రీకరించినట్టుగా 75 ఏళ్ల వయసు వచ్చినవారు సకల పదవులూ వదులుకోవాలి. ఆ లెక్కన వచ్చేఏడాదికి అదే సూత్రం వర్తించాలి. మోదీ ఓటు ఎలాగూ అమిత్ షాకే. ఈ లోగా షాకు అడ్డులేకుండా చేయాలంటే యోగీని గద్దె దించాలన్నది మోదీ వ్యూహంలో భాగం అయిఉండొచ్చు. కానీ అంతిమ నిర్ణేత ఆర్.ఎస్.ఎస్. అన్నది యోగీతో సహా ఎవరూ విస్మరించకూడదు. యోగీ ఎంతటి నాయకుడైనా యు.పి. మాజీ ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్ కన్నా అధికుడైతే కాదు. వాజ్‌పేయిని వ్యతిరేకించినందుకు కళ్యాణ్ సింగ్ కొన్నాళ్లపాటు బీజేపీకి దూరం కావలసి వచ్చింది. పైగా కళ్యాణ్‌సింగ్ లోధా అనే వెనుకబడిన తరగతికి చెందినవారు. యోగీ రాజపుత్రుడు. ఈ మధ్య రాజపుత్రులు బీజేపీ మీద గుర్రుగా ఉన్నారు. యోగీని గద్దె దించడానికి మోదీ-షా ద్వయం ఎంత బలంగా సంకల్పించినా ఆగస్టు ఆఖరు దాకా అది సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే యు.పి.లో పది శాసనసభా స్థానాలకు ఉపఎన్నికలు జరగవలసిఉంది. అదే యోగీకి ప్రస్తుతానికి శ్రీరామ రక్ష. 2022 ఎన్నికలకు ముందు కూడా యోగీ ఇదే సంకట స్థితిలో ఉండేవారు. ఆర్.ఎస్.ఎస్. దయాదాక్షిణ్యాలతో ఎదిగిన నాయకుడు కాదు కనక యోగీకి ఆ మాత్రం బింకం ఉండడం సహజమే.

- అనన్యవర్మ

సామాన్యులకు దూరంగా రైల్వేలు

జ్ఞాన్ పాఠక్

సుదీర్ఘకాలంగా పేదలు, సామాన్యులకు చౌకగా అందుబాటులో సేవలు అందిస్తున్న ఇండియన్ రైల్వేల నిర్వహణ విధానాన్ని మోదీ ప్రభుత్వం సమూలంగా మార్చివేసింది. ఇండియన్ రైల్వేల బడ్జెట్ 2024-25లో ధనికులకు చేరువగా రైళ్లను నడిపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే వందే భారత్, వందే మెట్రో, అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. గతంలో రైల్వే బడ్జెట్‌లు ప్రత్యేకంగా లోక్‌సభలో ప్రవేశ పెట్టేవారు. మోదీ ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చివేసి జనరల్ బడ్జెట్‌లో భాగం చేసింది. ఎక్కువ ధరలు ఉండే రైళ్లలో సామాన్యులకు ఒకటి, రెండు బోగీలు తప్పితే గతంలోవలె ప్రయాణానికి అనుకూలంగా ఎక్కువ బోగీలను వేయడంలేదు. రైల్వేలకు సంబంధించి మోదీ ప్రభుత్వం గత విధానాన్ని మార్చివేసి కొత్త పంథాను అనుసరిస్తున్నారు. రైల్వేలలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడానికే నూతన పంథాను అనుసరిస్తున్నామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ తెలిపారు. మంత్రి చేసిన ప్రకటనకు విరుద్ధంగా రైళ్ల ప్రయాణం జరుగుతుంది. ఇటీవలి కాలంలో రైళ్ల ప్రమాదాలు భారీ స్థాయిలో ప్రాణ నష్టం కలిగిస్తున్నాయి. రైల్వేల నిర్వహణలో బలహీనత, అశ్రద్ధ ఉన్నాయని జరుగుతున్న ప్రమాదాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయానికి రికార్డుస్థాయిలో కేటాయింపులు జరిగినట్లు మంత్రి చెప్పారు. ఈ నిధులలో ఎక్కువభాగం భద్రత కార్యక్రమాలకు ఖర్చుచేస్తామని మంత్రి వైష్ణవ్ ప్రకటించారు.

భద్రతాచర్యల అమలుసైతం సవాలుగా మారింది. ఉదాహరణకు భద్రతకు సంబంధించిన 'కవచ్ 4.0' ప్రవేశపెట్టాలని ఇప్పటికే నిర్ణయం జరిగింది. ఈ విధానం ఆటోమేటిక్‌గా పనిచేసి భద్రతనిస్తాయి. రైలుభద్రతా వ్యవస్థ రైలు ప్రమాదం జరగకుండా నిలువరించేందుకే ఈ వ్యవస్థను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆమోదించిందేగానీ ఇంతవరకు అమలు జరగలేదు. కవచ్‌లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఆప్టికల్ ఫైబర్ లాంటివి ఉంటాయి. రైల్వే వ్యవస్థలలో విభిన్న నెట్‌వర్క్ ఉంటుందని, అన్ని నెట్‌వర్క్‌లను మిళితంచేసి కవచ్‌ను ప్రవేశపెడతామని మంత్రి వైష్ణవ్ తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యధిక ప్రయాణీకులకు ఎంతో సౌకర్యంగాఉన్న రవాణా వ్యవస్థకు గతంలో ఎంతో ఆదరణ ఉన్న రైల్వేల పంథాను 2016నుంచి మార్చివేశారు. 2016లోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేకంగా ఉన్న బడ్జెట్‌ను నిలిపివేసి సార్వత్రిక కేంద్ర బడ్జెట్‌లో కలిపివేశారు. అప్పటినుంచి రైల్వేలపై బడ్జెట్‌లో అంత ప్రాధాన్యత నివ్వడంలేదు.

2017-18ఆర్థిక సంవత్సరంలో మొదటిసారిగా ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ ఉమ్మడి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అప్పటినుంచి భారత రైల్వేలకు ప్రత్యేకంగా బడ్జెట్ లేదు. అంతేకాదు, మోదీ ప్రభుత్వం భారత రైల్వే వ్యవస్థను అంతిమంగా ప్రైవేటురంగానికి అప్పగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రైల్వే వ్యవస్థ నిర్వహణ విధానాన్నే మార్పుచేశారు. దీనివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు నష్టం కలుగుతుందని నిపుణులు అభిప్రాయపడినప్పటికీ ప్రభుత్వం తన పంథాను మార్చుకోలేదు. కేంద్రంలో రైల్వేల నిర్వహణ కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా ఒక మంత్రిని నియమించలేదు.

ప్రస్తుత ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను 83 నిమిషాలపాటు లోక్‌సభలో చదివారు. భారత రైల్వేల అంశాన్ని ఆమె ఈ ప్రసంగంలో ఒక్కసారి మాత్రమే ప్రస్తావించారు. రైల్వే శాఖనుకూడా చూస్తున్న మంత్రి వైష్ణవ్ 2024-25 బడ్జెట్‌లో రికార్డుస్థాయిలో 2.55లక్షల కోట్లు కేటాయించారని చాలా గొప్పగా చెప్పారు. గత సంవత్సరం 2.4లక్షల కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం 5.85శాతం పెంచారని మంత్రి ప్రశంసలు కురిపించారు. పెంచిన మొత్తం 14వేల కోట్లు మాత్రమే. ఏడాదికాలంలో పెరిగిన వ్యయంలో సర్దుబాటుకు మాత్రమే ఈ మొత్తం సరిపోతుంది. సామాన్య లేదా సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే రైళ్లకోసం చేసే ఖర్చులో ఈ మొత్తం గొప్ప నిధులేమీకాదు.

> మొత్తం పెట్టుబడి వ్యయం కేటాయింపులు 2023-24లో 2.62లక్షల కోట్లు కాగా ఈసారి ఈ మొత్తాన్ని 2.65లక్షల కోట్లకు పెంచారు. ఇది గొప్పగా పెంచినట్లేమీ కాదు. మొత్తం ఆదాయంలో 2.5లక్షల కోట్లు కేటాయింపు పెద్దమొత్తమేమీ కాదు. నిర్భయ్ నిధి నుంచి 200కోట్లు, అంతర్గత వనరుల నుంచి 3వేల కోట్లు, అదనపు బడ్జెట్ వనరుల నుంచి 10వేల కోట్లు రైల్వేల కోసం సమీకరించారు. ఈ మొత్తాన్ని ఆస్తుల సమీకరణకు, నిర్మాణానికి, పాత పరికరాల స్థానంలో కొత్తవాటిని ఏర్పరచేందుకు వినియోగిస్తారు. ఈ నిధులు అత్యధికంగా భద్రతా కార్యక్రమాలకు ఖర్చు చేస్తారని మంత్రి వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ భారత రైల్వేలు ఇంకా మంచి స్థితిలోలేవని 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారవుతుందని అంచనా...

మొత్తం పెట్టుబడి వ్యయం కేటాయింపులు 2023-24లో 2.62లక్షల కోట్లు కాగా ఈసారి ఈ మొత్తాన్ని 2.65లక్షల కోట్లకు పెంచారు. ఇది గొప్పగా పెంచినట్లేమీ కాదు. మొత్తం ఆదాయంలో 2.5లక్షల కోట్లు కేటాయింపు పెద్దమొత్తమేమీ కాదు. నిర్భయ్ నిధి నుంచి 200కోట్లు, అంతర్గత వనరుల నుంచి 3వేల కోట్లు, అదనపు బడ్జెట్ వనరుల నుంచి 10వేల కోట్లు రైల్వేల కోసం సమీకరించారు. ఈ మొత్తాన్ని ఆస్తుల సమీకరణకు, నిర్మాణానికి, పాత పరికరాల స్థానంలో కొత్తవాటిని ఏర్పరచేందుకు వినియోగిస్తారు. ఈ నిధులు అత్యధికంగా భద్రతా కార్యక్రమాలకు ఖర్చు చేస్తారని మంత్రి వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ భారత రైల్వేలు ఇంకా మంచి స్థితిలోలేవని 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారవుతుందని అంచనా. ఎందుకంటే నిర్వహణ నిష్పత్తి 98.22శాతం ఉంటుందని అంచనా. 2023-24లో ఇది 98.10శాతంగా ఉంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో 100శాతం ఆదాయంలో 98.22శాతం ఖర్చు చేస్తారు. ముఖ్యమైన ఖర్చులకోసం ఈ కేటాయింపులు వాస్తవంగా సరిపోవు. అయినప్పటికీ మంత్రి ఇది గొప్ప కేటాయింపుగా వెల్లడించారు. రైల్వే ప్రయాణీకుల భద్రత, సౌకర్యాల కల్పన, సౌకర్యంగా ప్రయాణం చేయడానికి తగిన చర్యలకు కేటాయించిన మొత్తం ఏ మాత్రం సరిపోదు. సాధారణ ప్రజలకోసం చేస్తున్న ఖర్చు, కొత్తగా ప్రవేశపెట్టిన ఆధునిక రైళ్ల కోసం చేస్తున్న ఖర్చు చాలా తేడా ఉంది. రైల్వేల ద్వారా వచ్చే ఆదాయం ఖర్చు కంటే చాలా తక్కువగా ఉందని ఇది 2.73లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గత సంవత్సరం రైల్వేలనుంచి సాధారణంగా వచ్చే ఆదాయం 3390 కోట్లు కాగా, గతసంవత్సరం సవరించిన అంచనాలు రూ.3271కోట్లు. కేవలం 122కోట్లు మాత్రమే అదనంగా లభించింది. భారత రైల్వేలపై కేంద్రప్రభుత్వం ఎంతశ్రద్ధ వహిస్తున్నదో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. రైల్వేల ద్వారా వస్తున్న ఆదాయం తగ్గినప్పుడు ప్రభుత్వమే ఆ లోటు పూడ్చేందుకు నిధులను అందచేస్తున్నది. కొత్త లైన్ల నిర్మాణానికి 34,602కోట్లు, గేజ్ మార్పిడికి 4719కోట్లు, డబ్లింగ్(రెండు లైన్లు) కోసం 29,312 కోట్లు, కంప్యూటరీకరణ కోసం రవాణా సౌకర్యాలు కోసం 375కోట్లు, యార్డు ఆధునీకరణకోసం 8982కోట్లు, రోలింగ్ స్టాక్ కోసం 24,270కోట్లు ఖర్చు అంచనా వేశారు. రైల్వే బడ్జెట్ చాలా బలహీనంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు.

అమెరికా అధ్యక్ష పోటీకి కమలా హారిస్ రెడీ

అమెరికా అధ్యక్ష పదవికి డెమొక్రటిక్ పార్టీ తరఫున కమలాహారిస్ పోటీ చేయడానికి తగినంత మంది ఆ పార్టీ ప్రతినిధులు మద్దతు పలికారు. ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు 1976మంది ప్రతినిధుల మద్దతు అవసరం. అయితే, 2668 మంది ప్రతినిధులు తమ మద్దతును ప్రకటించారు. కమలాహారిస్ ఇప్పటికే అధ్యక్ష పదవికి ప్రచారాన్ని ప్రారంభించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున రెండవసారి పోటీకి నిలిచిన మాజీ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పైన తీవ్రంగా విమర్శలు చేశారు. డెమొక్రటిక్ పార్టీ తరఫున ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ రెండోసారి పోటీచేసేందుకు సిద్ధపడ్డారు. అయితే సొంతపార్టీ నుంచి వ్యతిరేకత, అనారోగ్య సమస్యలతో పోటీనుంచి విరమిస్తున్నట్లు ప్రకటించి తన మద్దతును కమలాహారిస్‌కేనని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో చేయవలసిన తీరుతెన్నులపై పార్టీ నుంచి సలహాలు పొందారు. ట్రంప్ అనేక మోసాలకు పేరుపడ్డారని కోర్టులుసైతం ఆయనను తప్పుబట్టి శిక్షలు విధించారని అందువల్ల ఆయనను దేశ అధ్యక్షుడుగా ఎన్నుకోవద్దని కమలాహారిస్ తన ప్రచారంలో పేర్కొన్నారు. కమలాహారిస్ ప్రచారంకోసం మొదటి 24గంటల్లోనే రికార్డుస్థాయిలో 81మిలియన్ డాలర్లు విరాళాలు అందాయి. ఆమె ఎన్నికల ప్రచారంలో మద్దతుగా నిలిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని 28వేలమంది వలంటీర్లు తమ పేర్లను నమోదుచేసుకున్నారు. డెమొక్రటిక్ జాతీయ కమిటీ అధ్యక్షుడు ఆగస్టు 7వ తేదీన అధ్యక్షపదవికి కమలాహారిస్‌ను ఆమోదించినట్లుగా ప్రకటిస్తామన్నారు. ఆగస్టులో చికాగోలో జరగనున్న సమావేశంలో కమలాహారిస్‌ను అధ్యక్షపదవికి పోటీ చేసేందుకు ప్రతినిధులు ఎన్నుకుంటారని ఈ మేరకు డెమొక్రాట్లు ఇప్పటికే నిర్ణయించారని ఏపీ వార్తాసంస్థ తెలియజేసింది. రిపబ్లికన్ పార్టీ తరఫున ఉపాధ్యక్షుడుగా పోటీ చేసేందుకు అనుమతి లభించిన జేడీ వాన్స్

మొదటిసారిగా తనంతటతానే ఒంటరిగా ర్యాలీ నిర్వహించారు. ఆయన కమలాహారిస్‌పైన తీవ్ర విమర్శలు చేశారు. బైడెన్‌కంటే మిలియన్ సార్లు అధ్వాన్నమైన వ్యక్తి అని వాన్స్ విమర్శించారు. అధ్యక్షురాలిగా పనిచేసేందుకు ఆమె శక్తి చాలదన్నారు.

కమలాహారిస్ భారతీయ, ఆఫ్రికా మూలాలు కలిగిన వనిత. తల్లి భారతీయురాలుకాగా, తండ్రి ఆఫ్రికాకు చెందినవారు. అమెరికాలో ఆఫ్రికా పౌరులు అలాగే భారతీయులు గణనీయంగా ఉన్నారు. వీరంతా కమలాహారిస్‌కు మద్దతునిచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇటీవల ట్రంప్‌ను చంపేందుకు ప్రయత్నం జరిగింది. అంతకుముందే బైడెన్‌మీద ట్రంప్ అత్యధికంగా ఆదరణ పొందినట్లుగా అంచనాలు వచ్చాయి. బైడెన్ తప్పుకున్న తర్వాత పరిస్థితి మారింది. అయితే కమలాహారిస్ ట్రంప్‌కంటే మేలైన అభ్యర్థి అన్న అభిప్రాయాలుకూడా మెండుగాఉన్నాయి. ట్రంప్ మీద జరిగిన హత్యాప్రయత్నంపై దర్యాప్తు జరుగుతున్నదని జాతీయ భద్రత, విదేశాంగ విధాన స్పెషలిస్టు గ్లీన్ కార్లే, నిఘా విభాగం వైఫల్యమేనని అన్నారు. కమలాహారిస్ గతంలో ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ఫలితంగా ఆమెకు మరింతమంది ప్రతినిధులు తోడ్పాటుగా నిలిచారు.

కమలాహారిస్ తల్లి జన్మించిన తమిళనాడులోని తులసేంద్ర పురం గ్రామంలో ఈ సందర్భంగా వేడుకలు చేసుకున్నారని సమాచారం. హారిస్ గెలుపొందేవరకు ఈ గ్రామంలో పూజలు చేయాలని తలపెట్టారు. భారతదేశంలో ఆమె పేరును ఒక వీధికి పెట్టారు. కోవిడ్-19 మహమ్మారికిగురైన బైడెన్ మంగళవారం మధ్యాహ్నం వైట్‌హౌస్‌కు వచ్చారు. గురువారం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును కలవనున్నారు. హారిస్‌కూడా కలిసి మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. ఎప్పుడు మాట్లాడే తేదీని ప్రకటిస్తానన్నారు. ఇటీవల దేశ అధ్యక్ష పదవికి గెలుపెవరిదని జరిగిన సర్వేలో ట్రంప్ కంటే కమలాహారిస్‌కే కొంచం ఆధిక్యత ఉందని వెల్లడైంది. ఈ విషయాన్ని మంగళవారం సర్వే నిర్వాహకులు ప్రకటించారు. బైడెన్ పోటీ నుంచి తప్పుకున్న తర్వాత నుంచి సర్వేలు నిర్వహిస్తున్నారు. రాయ్‌టర్స్ తదితర సంస్థలు జరిపిన సర్వేలోనూ హారిస్ కొద్దిగా ట్రంప్ కంటే ఆధిక్యతలో ఉన్నారని తెలిపాయి. ట్రంప్‌కు 42శాతం ఓట్లు రాగా, హారిస్‌కి 44శాతం ఓట్లు లభించాయి. ఆదివారం నుంచి రెండుసార్లు సర్వేలు వచ్చాయి. కమలాహారిస్ వయస్సు 59సంవత్సరాలు కాగా, ట్రంప్ వయస్సు 78 సంవత్సరాలు. పీబీఎస్ న్యూస్‌పోల్‌లో హారిస్‌కంటే ట్రంప్ కొంచం ఆధిక్యతలో ఉన్నట్లు వెల్లడైంది. ఈ సర్వేలో ట్రంప్‌కు 46శాతం మద్దతు తెలపగా హారిస్‌కు 45శాతం మంది తోడ్పాటు అందించారు. 9శాతం మంది ఎటూ నిర్ణయించుకోలేదని చెప్పారు. 284 సంవత్సరాల తర్వాత మహిళను అధ్యక్షురాలిగా ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఎడిట్ పేజి డెస్క్

ఈ పండుగ ఎంతోకాలం సాగదు

నితీశ్, చంద్రబాబుకు సెల్జా హెచ్చరిక

అబద్ధాలపుట్ట కేంద్ర బడ్జెట్ అని విమర్శ

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ మొత్తం 'అబద్ధాల పుట్ట' అని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కుమారి సెల్జా విమర్శించారు. బడ్జెట్‌లో పెద్ద వాటా పొందడం కోసం ఈ రోజు పండుగ జరుపుకోవచ్చు. కానీ అది మారడానికి ఎక్కువ సమయం పట్టదని ఎన్‌డీఏ భాగస్వాములు నితీశ్ కుమార్, నారా చంద్రబాబు నాయుడును హెచ్చరించారు. బడ్జెట్‌పై సెల్జా చర్చను ప్రారంభించి కుల గణన లేకుండా లక్ష్య గ్రూపులను ఎలా గుర్తించారని ప్రశ్నించారు. ఆరుసార్లు బడ్జెట్ సమర్పించినందుకు ఆర్థిక మంత్రిని అభినందించడం ద్వారా ఆమె ప్రసంగాన్ని ప్రారంభించారు. 'ఒక మహిళగా నేను ఆమెను అభినందిస్తున్నాను. కాంగ్రెస్ ఎంపీగా, మేము చాలా కష్టపడి తయారు చేసిన మా మేనిఫెస్టోను ఆమె చదివినందుకు నేను సంతోషిస్తున్నాను' అని ఎద్దేవా చేశారు. 'ఈ బడ్జెట్ ఎవరి కోసం? ఇది రెండు రాష్ట్రాలకు మాత్రమేనా? లేదా దేశం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నారా? ఈ రెండు రాష్ట్రాలు లేదా బీజేపీ పాలిత రాష్ట్రాలకు మించి ఏమీ పరిగణించినట్లు కనిపించడం లేదు' అని సెల్జా అన్నారు. 'నేను ఈ రెండు రాష్ట్రాలను హెచ్చరిస్తున్నాను... నితీష్ జీ చాలా కాలంగా మాతో ఉన్నారు. 10వ లోక్‌సభలో పనిచేశారు. నాయుడు జీ కూడా చాలా అనుభవజ్ఞుడు. వారి (ప్రభుత్వ) మాటలకు లొంగకండి. ఈ రోజు వారు చాలా ఇచ్చారని అనిపించవచ్చు. కానీ అలలు మారడానికి ఎక్కువ సమయం పట్టదు. అందువల్ల నేను వారిని (జేడీయూ, టీడీపీ) కూడా హెచ్చరించాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. బడ్జెట్‌ను 'కుర్సీ బచావో బడ్జెట్', 'విచ్లిత్ బడ్జెట్', 'జుమ్లాస్' అని సెల్జా విమర్శించారు. కుల గణన లేకుండా పేదలు, మహిళలు, రైతులు, యువకుల లక్ష్య సమూహాలను ఎలా గుర్తించారని ప్రశ్నించారు. 'రాహుల్ గాంధీ తరచూ కుల గణనను డిమాండ్ చేస్తున్నారు. మీరు జనాభా గణనను నిర్వహించి బహిరంగ పరచకపోతే మీరు లక్ష్య గ్రూపులను ఎలా లెక్కించగలరు?' అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వంపై తగ్గుతున్న విశ్వాసాన్ని ఎత్తి చూపుతూ, 'ప్రజలు ఈ బడ్జెట్‌ను విశ్వసించడం లేదు. అందుకే సీట్ల సంఖ్య 303 నుంచి 240కు పడిపోయింది' అని అన్నారు. ప్రాంతీయ అసమానతల విషయాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల దిశగా సాగుతున్న జార్ఖండ్, మహారాష్ట్ర, హర్యానా, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాల ప్రస్తావన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. హర్యానాకు చెందిన ముగ్గురు మంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఏమీ అందకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ బడ్జెట్‌ను సగానికి తగ్గించడం, స్వామినాథన్ కమిటీ నివేదిక, ఎంఎస్‌పీ హామీలను విస్మరించడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. 'ఈ రోజు తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం ఉంది. అయినప్పటికీ శ్రద్ధ చూపడం లేదు' అని ఆమె నొక్కి చెప్పారు. ప్రభుత్వం రైతుల కంటే కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. రైతులు కష్టాల్లో కూరుకుపోతే, మీరు పెట్టుబడిదారులకు మాత్రమే మద్దతు ఇస్తున్నారని, ప్రతి రైతు అప్పుల పాలయ్యారని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి పథకాల నిర్వహణ, బడ్జెట్‌లో ప్రభుత్వం దాని గురించి ప్రస్తావించకపోవడాన్ని సెల్జా విమర్శించారు. 'కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఎంఎస్‌ఆర్‌ఈజీఏ ఒక రక్షకుడు. కానీ మీరు ఇప్పుడు దానిని మరచిపోయారు. మా సమయం వచ్చినప్పుడు మేము రోజుకు రూ.400 కనీస వేతనం అందిస్తాం' అని అన్నారు. విద్య, ఆరోగ్య అంశాలపై మాట్లాడుతూ ప్రాథమిక విద్య నాణ్యత క్షీణించడం, ఉపాధిపై చర్చ లేకపోవడం గురించి సెల్జా ఎత్తి చూపారు. కేంద్ర స్థాయిలో 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, హర్యానాలోనే 2 లక్షల ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు. హర్యానాలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య సంరక్షణ మెరుగుదలకు మూలస్తంభంగా ఉన్న ఆయుష్మాన్ విశ్వవిద్యాలయ ప్రాజెక్టు విషయాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమర్థవంతమైన విధానాలను అమలు చేయడం కంటే పథకాల పేర్లను మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని సెల్జా విమర్శించారు. ఫరీదాబాద్, గుర్గావ్‌లోని దుర్భర పరిస్థితులను ప్రస్తావిస్తూ, 'మీరు వస్తువులను పేరు మార్చడం ఇష్టపడతారు. నగరాన్ని 'స్మార్ట్ సిటీ' అని పిలవడం వల్ల స్మార్ట్‌గా మారదు' అని ఆమె అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ బీరేంద్ర సింగ్ కేంద్ర బడ్జెట్‌ను 'సర్కార్ బచావో బడ్జెట్' అని అన్నారు. 'పీఎం మోదీ ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చారు. కానీ సీతారామన్ ప్రసంగంలో మేము ఉత్తర ప్రదేశ్ గురించి ఒక్క మాట కూడా వినలేదు. ఉత్తర ప్రదేశ్ బీజేపీని మెజారిటీ రాకుండా ఆపిన విధానం, బహుశా దానికి మూల్యం చెల్లిస్తోంది' అని ఆయన అన్నారు. అగ్నిపథ్ సైనిక నియామక పథకాన్ని వెనక్కి తీసుకోవాలని కూడా సింగ్ డిమాండ్ చేశారు.

లాలు ప్రసాద్‌కు అస్వస్థత

న్యూఢిల్లీ: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. దీంతో ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ఆస్పత్రిలో ఉన్నారు. ఆరోగ్యం ఇబ్బందికరంగా ఉండడంతో సోమవారమే ఆయన పాట్నా నుంచి ఢిల్లీకి వచ్చారు. కాగా దాణా కుంభకోణం కేసుల్లో దోషిగా తేలిన ఆయన ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2022లో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి కూడా చేయించుకున్నారు. లాలూ కిడ్నీలు 25 శాతం మాత్రమే పనిచేయడంతో మార్పిడి చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించారు. దీంతో సింగపూర్‌లో నివసిస్తున్న లాలూ కుమార్తె రోహిణి ఆచార్య తన కిడ్నీని తండ్రికి దానం చేశారు. డిసెంబర్ 5, 2022న చికిత్స జరగగా ఆయన కోలుకొని తిరిగి భారత్ వచ్చారు. రోహిణి ఆచార్య సింగపూర్‌లో నివసిస్తున్నారు.

'జైలు... లేదంటే నరకానికే'

ఉగ్రవాదులకు కేంద్ర మంత్రి హెచ్చరిక

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడులు కలకలం సృష్టిస్తున్నాయి. దీనిపై రాజ్యసభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో క్రియాశీల ఉగ్రవాదులను జైళ్లకు తరలిస్తామని, లేదంటే నరకానికే పంపిస్తామని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో వరుసగా జరుగుతోన్న ఉగ్రదాడులపై కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ ప్రశ్నించారు. దీనికి నిత్యానంద్ రాయ్ బదులిచ్చారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన దగ్గరి నుంచి భద్రతా సిబ్బంది 900 మంది ఉగ్రవాదుల్ని హతమార్చారు. 'ఉగ్రవాదాన్ని మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహించదు. దానిని అంతం చేస్తాం. వారు జైలులో ఉంటారు. లేదంటే నరకానికి వెళ్తారు. దీనిపై సభా వేదికగా హామీ ఇస్తున్నాను' అని సమాధానం ఇచ్చారు. 2004 నుంచి 2014 మధ్య యూపీఏ హయాంలో 7,217 ఉగ్రఘటనలు చోటుచేసుకున్నాయి. 2014 తర్వాత ఆ సంఖ్య 2,259కి పడిపోయింది. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని వ్యాఖ్యానించిన మంత్రి...వాటిపై విపక్షాలు రాజకీయాలు చేయడం తగదని అన్నారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని, వారి భద్రతకు పూర్తి హామీ ఉందని తెలిపారు.

పోలీసు ఉద్యోగమే మేలు

రాజకీయాలపై అన్నామలై నిర్వేదం

చెన్నై: రాజకీయాల కంటే పోలీస్ ఉద్యోగమే మంచిదనే భావన కలుగుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాల్లో కొనసాగాలా? వద్దా? అనే ఆలోచన వస్తోందని బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో తన విజయం కోసం కృషి చేసిన అనుచరులు, సన్నిహితులతో ఆయన సమావేశం నిర్వహించి... వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన తన మనసులోని మాట చెప్పినట్లు తెలిసింది. గత మూడేళ్లుగా రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ అనేక విషయాలు నేర్చుకున్నట్టు చెప్పారు. 'రాజకీయ నేతగా ఇది నాకెంతో కష్టకాలం. ఎన్నో కష్టనష్టాలు ఓర్చి ఈ కుర్చీలో ఉన్నాను. ఇలాంటి రాజకీయాల్లో మనం కొనసాగాలా? వద్దా? అనే ఆలోచన చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాజకీయాల కంటే పోలీసు ఉద్యోగమే ఎంతో సులభం. పోలీస్ శాఖలో బ్లాక్ అండ్ వైట్ అనే రెండు మాత్రమే ఉంటాయి.

ఒక నిందితుడు తప్పు చేశాడా లేదా అన్నదే ముఖ్యం. ఈ విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. కానీ, రాజకీయాల్లో కొనసాగాలంటే అనేక విషయాల్లో రాజీ పడాల్సి వస్తుంది. ఇక్కడ సాధారణ వ్యక్తిగా మాట్లాడేందుకు వీలుండదు. సొంత పార్టీ నేతలే అసత్యాలు చెప్పినా వాటిని భరించాలి. రాజకీయాల్లో విజయం సాధించాలంటే ఎంతగానో శ్రమించాల్సి ఉంది. ప్రజాస్వామ్యంలో అనేక సందర్భాల్లో నిర్వేదం ఆవహిస్తోంది. కొన్నిమార్లు నా వ్యవహారశైలి కూడా మీతో పాటు అనేక మందికి ఆగ్రహం కలిగించి ఉంటుంది. అన్ని వేళల్లో కత్తి పట్టుకుని ముందుకు వెళ్లలేం. కొన్ని సందర్భాల్లో వెనకడుగు వేయాల్సి ఉంటుంది. ఎల్లవేళలా టాప్‌గేర్‌లో డ్రైవింగ్ చేస్తే గేర్ బాక్స్ చెడిపోతుంది. ఫాస్ట్ గేర్‌లో వెళితే కారు మరమ్మతులకు గురవుతుంది. అవసరమైన సమయంలో అవసరమైన గేర్‌లో డ్రైవింగ్ చేయాలి. 2026 ఎన్నికలకు మనమంతా ఐదో గేర్‌లో ప్రయాణించాల్సి ఉంటుంది. కోయంబత్తూరులో నాకు విజయం కాస్త దూరమైందంతే. అక్కడ 4.5 లక్షల ఓట్లు పొందడం గొప్ప విషయం. రాజకీయాల్లో ఉన్నపుడు సమస్యలు రావడం సహజమే. మంచి వారికే కష్టాలు ఎదురవుతాయి.

నేను తప్పు చేసినా ధైర్యంగా ప్రశ్నించండి' అని అన్నామలై సూచించినట్లు తెలిసింది.

ఉమర్ బెయిల్‌పై మీ వైఖరి తెలపండి

ఢిల్లీ పోలీసులకు హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్ల సూత్రధారిగా జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖాలిద్‌పై ఉపా కేసులో బెయిల్ వ్యవహారాన్ని జస్టిస్ సురేశ్ కుమార్ కైత్, జస్టిస్ గిరీశ్ కత్పాలియాతో కూడిన ఢిల్లీ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఉమర్‌కు బెయిల్ ఇవ్వడంపై ఢిల్లీ పోలీసుల వివరణ కోరుతూ నోటీసు జారీచేసింది. తదుపరి విచారణను ఆగస్టు 29వ తేదీకి వాయిదా వేసింది. అదే రోజు ఈ కేసులో సహ నిందితుల బెయిల్ పిటిషన్లూ విచారణకు రానున్నాయి. ఉమర్ ఖాలిద్‌ను 2020 సెప్టెంబరులో పోలీసులు అరెస్టుచేశారు.

ఆయన కేసులో విచారణ పురోగమించలేదు. కిందిస్థాయి నుంచి ఉన్నత న్యాయస్థానాల వరకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించాయి. విద్యార్థి కార్యకర్త షర్జిల్ ఇమామ్ కూడా ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా 2020లో జరిగిన ఢిల్లీ అల్లర్లలో 53 మంది చనిపోగా, 700 మందికి గాయాలయ్యాయి. ఉమర్, షర్జిల్‌తో పాటు మరికొందరిని ఈ అల్లర్లకు సూత్రధారులంటూ ఉపా కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే.

అలీగఢ్ వర్సిటీలో ఉద్యోగులపై కాల్పులు

లక్నో: యూపీలోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) క్యాంపస్‌లో బుధవారం కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు ఉద్యోగులపై కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. సెక్యూరిటీ సిబ్బంది ఇద్దరు దుండగులను పట్టుకున్నారు. గాయపడిన ఇద్దరు ఉద్యోగులను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఏఎంయు తరచూ ఏదోఒక వివాదంలో చిక్కుకుంటూనే ఉంది. ఈ ఏడాది మార్చిలో హోలీ సందర్భంగా ఇక్కడ అల్లర్లు చోటుచేసుకున్నాయి. హోలీ సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులపై మరో వర్గం దాడి చేసింది. దీంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు సివిల్‌లైన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. గత మేలోనూ వర్సిటీ ఎస్ఎస్ హాల్ క్యాంపస్‌లో రెండు వర్గాల విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక వర్గంవారు గాలిలోకి కాల్పులు జరిపారు. ఈ ఉదంతం జరిగినప్పుడు అక్కడి సెక్యూరిటీ సిబ్బంది ఇద్దరు నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించింది. గాయపడిన బీటెక్ విద్యార్థిని వెంటనే వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందించారు.

ఐటీ పరిశ్రమల డిమాండ్లపై చర్చలు

మంత్రి ప్రియాంక్ ఖర్గే

బెంగళూరు: ఐటీ ఉద్యోగుల పనివేళలు పెంచాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఉద్యోగులు మండిపడుతున్నారు. రోజుకు 14 గంటల పని ప్రతిపాదనకు నిరసనగా రాష్ట్ర ఐటీ ఉద్యోగులు చేపట్టిన సామూహిక ఈ-మెయిల్ క్యాంపెయిన్‌పై కర్నాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. ఐటీ పరిశ్రమల నుంచి వచ్చిన డిమాండ్లను కార్మికశాఖ ముందుంచామని, దీనిపై చర్చలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని, తనకు తెలిసినంతవరకూ ఈ నిబంధనలన్ని ఐటీ కంపెనీలు, ఐటీ ఆధారిత కంపెనీలకు వర్తించేది కాదని స్పష్టం చేశారు. బిల్లులో పొందుపరిచిన పూర్తి నిబంధనలు ఆన్‌లైన్ క్యాంపెయిన్ చేపట్టిన వారికి తెలుసో లేదో అని మంత్రి వ్యాఖ్యానించారు. కాగా, ఉద్యోగుల పనివేళలు పెంచాలనే నిర్ణయం ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే తీసుకున్న నిర్ణయం కాదని, పనివేళలు పెంచాలని స్వయంగా ఐటీ కంపెనీలే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయని కార్మిక మంత్రి సంతోశ్ లాడ్ తెలిపారు. ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు, బీపీఓల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రోజుకు 12 గంటలకు పైగా పనిచేయడానికి వీలు కల్పించేలా నూతన బిల్లు అనమతిస్తుంది. నూతన బిల్లు చట్టరూపం దాల్చితే రోజులో అత్యధికంగా 14 గంటల చొప్పున పనిచేసే వెసులుబాటు కలుగుతుంది. ఇప్పుడు ఓవర్‌టైంతో కలిపి గరిష్టంగా 10 గంటలు మాత్రమే ఐటీ ఉద్యోగులతో పనిచేయించే వెసులుబాటు ఉంది. కర్నాటక ప్రభుత్వ నూతన ప్రతిపాదనపై కార్మిక సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది.

రాహుల్ క్షమాపణ చెబుతారా: బీజేపీ

న్యూఢిల్లీ: నీట్‌ను తిరిగి నిర్వహించాలనే అభ్యర్థనను తాజాగా సుప్రీంకోర్టు తిరస్కరించడంతో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ ఆరోపణలు గుప్పించింది. దేశంలోని పరీక్షా విధానంపై రాహుల్ ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగిస్తున్నారని బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. ఇప్పటికైనా తను చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ రాహుల్ క్షమాపణలు చెబుతారా అని ఆయన ప్రశ్నించారు. దేశంలోని పరీక్షా విధానాల్లో మోసం జరుగుతుందంటూ ఇప్పటివరకు రాహుల్ ఆరోపిస్తూ వచ్చారు. ఇలా అసత్య ఆరోపణలు చేస్తూ ఆయన దేశంలోని విద్యావ్యవస్థ పరువు తీయాలనుకుంటున్నారా?.. కాంగ్రెస్ హయాంలో ఎన్నోసార్లు పేపర్ లీకులు జరిగాయి. ఇప్పుడు ఎందుకు ఆయన ఇలా దేశాన్ని అవమానిస్తున్నారు? తను చేసిన వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణ చెబుతారా అంటూ రవిశంకర్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు 22, 23, 24 సంవత్సరాల ఫలితాలను పరిశీలించిందని, పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేసిందని ఆయన పేర్కొన్నారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఇకనైనా రాహుల్ ఇటువంటి అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు.

అర్ధరాత్రి హాస్టల్‌లో చొరబడి... యువతి గొంతు కోసి...

బెంగళూరు: ఓ దుండగుడు అర్ధరాత్రి మహిళల హాస్టల్లో చొరబడి ఓ యువతి గొంతు కోసి హతమార్చాడు. ఈ ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని లేడీస్ హాస్టల్‌లోకి అర్ధరాత్రి ఓ వ్యక్తి చొరబడ్డాడు. బీహార్‌కు చెందిన కృతి కుమారి(24) అనే యువతి గదిలోకి ప్రవేశించి కత్తితో ఆమె గొంతు కోసి, దారుణంగా హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. బుధవారం ఉదయం యువతి రక్తపు మడుగులో ఉండడాన్ని గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. హత్యకు గల కారణాలు తెలియలేదని తెలిపారు. నిందితుడిని గుర్తించేందుకు ఆ ప్రాంతంలో ఉన్న అన్ని సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రశ్నపత్రాల లీక్‌పై ఉక్కుపాదం

అక్రమార్కులకు జైలు... రూ.10 లక్షల జరిమానా

కీలక బిల్లు తీసుకొచ్చిన బీహార్ ప్రభుత్వం

పాట్నా: రాష్ట్రంలో ప్రభుత్వ నియామక పరీక్షల్లో ప్రశ్నా పత్రాల లీక్‌లు, ఇతర అవకతవకలను అరికట్టడానికి ఉద్దేశించిన బిల్లును బీహార్ అసెంబ్లీ బుధవారం ఆమోదించింది. బీహార్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (పీఈ) (అన్యాయమైన మార్గాల నివారణ) బిల్లు-2024 ను రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి సభలో ప్రవేశ పెట్టారు. ప్రతిపక్షాల వాకౌట్ మధ్య బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. నీట్-యూజీ 2024 ప్రశ్నాపత్రం లీక్ వివాదంలో యాదృచ్ఛికంగా కేంద్రంగా ఉన్న రాష్ట్రంలో ప్రశ్నా పత్రాల లీక్‌తో సహా పోటీ పరీక్షల్లో అక్రమాలను అరికట్టడం కొత్త చట్టం లక్ష్యం. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారికి మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానాతో సహా కఠినంగా శిక్షించాలని బిల్లు నిర్దేశించింది. అటువంటి పరీక్షలను నిర్వహించే సంస్థలయిన సర్వీస్ ప్రొవైడర్లను నాలుగు సంవత్సరాల వరకు సేవలను బహిష్కరించడం, ఆస్తులను అటాచ్ చేయడంతో పాటు కోటి రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని చౌదరి తెలిపారు. అటువంటి పరీక్ష నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చులో కొంత భాగాన్ని ఉల్లంఘించిన సర్వీస్ ప్రొవైడర్ నుంచి వసూలు చేస్తామని మంత్రి తెలిపారు. 'లక్షలాది మంది యువతీ యువకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చి బిల్లు. అటువంటి కేసుల్లో దర్యాప్తు అధికారులు పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ స్థాయి కంటే తక్కువ ఉండకూడదు' అని చెప్పారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్‌సీ), ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌ఈ 3.0) ప్రశ్నా పత్రం లీక్ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్రం, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు రూపొందించిన కఠినమైన ప్రశ్నా పత్రం నిరోధక చట్టాల నేపథ్యంలో కొత్త చట్టం కూడా వచ్చింది.

రైతు సమస్యలకు మధ్యవర్తి అవసరం: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న రైతులకు, ప్రభుత్వానికి మధ్య విశ్వాసం లోపించినట్లు స్పష్టంగా తెలుస్తోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రైతుల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వాలు కొన్ని చర్యలు చేపట్టాలని అభిప్రాయపడింది. శంభూ సరిహద్దు పరిస్థితులపై హర్యానా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. 'రైతుల సమస్యలు తీర్చేందుకు మీరు (కేంద్ర ప్రభుత్వం) కొన్ని చర్యలు చేపట్టాలి. లేదంటే వారు ఢిల్లీకి ఎందుకు రావాలనుకుంటారు? ఇక్కడి నుంచి మీరు మంత్రులను పంపిస్తున్నారు. కానీ, మీపై వారికి విశ్వాసం లోపించినట్లు కన్పిస్తోంది. స్థానిక సమస్యలను విస్మరించి మీరు స్వప్రయోజనాల గురించి మాత్రమే చర్చిస్తున్నారని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలు, ప్రభుత్వం మధ్య విశ్వాసం కలిగించే ఓ తటస్థ అంపైర్ కావాలి. అలాంటి వ్యక్తిని మీరు ఎందుకు పంపించట్లేదు' అని ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది.

రైతుల డిమాండ్ల పరిష్కారం కోసం ఓ స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ప్రతిపాదించింది. ఈ కమిటీ సభ్యుల పేర్లను ఇవ్వాలనిపంజాబ్, హర్యానా ప్రభుత్వాలకు సూచించింది. దీనిపై వారం రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని, అప్పటిదాకా శంభూ సరిహద్దుల్లో యథాతథ స్థితి కొనసాగించాలని తెలిపింది. సరిహద్దులోని బారికేడ్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రెండు రాష్ట్రాలను ఆదేశించింది. రైతుల ఉద్యమం సందర్భంగా హర్యానాలోని అంబాలాకు సమీపంలోని శంభూ సరిహద్దు వద్ద ఏర్పాటుచేసిన అడ్డుకట్టల్ని వారంలోగా తొలగించాలని ఇటీవల పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం... రాష్ట్ర ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 'హైవేను ఒక రాష్ట్రం ఎలా దిగ్బంధిస్తుంది? ట్రాఫిక్‌ను నియంత్రించడం దాని బాధ్యత. జాతీయ రహదారిని తెరవండి.. కానీ, రాకపోకలను నియంత్రించండి' అని ధర్మాసనం ఆదేశించింది.

అన్ని రాష్ట్రాల పేర్లు చెప్పలేం

బడ్జెట్ ప్రసంగంపై నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: విపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివక్ష చూపారని ఇండియా ఐక్యసంఘటన నేతలు ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పార్లమెంటు లోపలా, వెలుపలా నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై నిర్మలా సీతారామన్ ఎదురుదాడికి దిగారు. బుధవారం రాజ్యసభలో ప్రసంగించిన ఆమె... బడ్జెట్ ప్రసంగంలోనే అన్ని రాష్ట్రాల పేర్లు చెప్పలేమన్నారు. 'కేంద్రం ప్రవేశపెట్టే ప్రతీ బడ్జెట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించే అవకాశం రాదు. మహారాష్ట్రలోని వందవన్‌లో పోర్ట్ ఏర్పాటుచేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కానీ, నిన్నటి బడ్జెట్‌లో మహారాష్ట్ర పేరు చెప్పలేదు. అలాగని.. తమను విస్మరించారని ఆ రాష్ట్రం భావిస్తోందా? బడ్జెట్ ప్రసంగంలో ఓ రాష్ట్రం పేరు ప్రస్తావించనంత మాత్రాన కేంద్రం నుంచి వారికి నిధులు వెళ్లవా? విపక్షాలది నిరాధార ఆరోపణ. తమ రాష్ట్రాలకు ఏమీ ఇవ్వలేదన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కల్పించాలని ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి కుట్రలు చేస్తున్నాయి' అని మంత్రి నిర్మలమ్మ చెప్పుకొచ్చారు. ఆమె సమాధానంపై విపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. ఈ సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 'బడ్జెట్‌లో రాష్ట్రాల మధ్య సమతుల్యత లేకపోతే అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది? దీన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనిపై నిరసన తెలియజేస్తాం' అని అన్నారు.

'అగ్నిపథ్' రద్దుచేయాలి: చిదంబరం

న్యూఢిల్లీ: వివాదాస్పద అగ్నిపథ్ పథకం రద్దు చేయాలని రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు, మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం కేంద్రంలోని ఎన్డీఏ సర్కారును డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రాజ్యసభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో మాట్లాడుతూ అగ్నిపథ్ రద్దు సహా ఐదు కీలక డిమాండ్లను లేవనెత్తారు. 2వేల సంవత్సరం నుంచి ఆందోళన చేస్తున్న రైతుల కీలక డిమాండ్... పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని, రోజువారీ కనీస వేతనం రూ.400లుగా నిర్ధారించాలని కోరారు. అలాగే మార్చి వరకు చెల్లించకుండా ఉన్న విద్యా రుణాలను మాఫీ చేయాలని, వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న నీట్ పరీక్షను వ్యతిరేకిస్తున్న రాష్ట్రాలకు 'నీట్' నుంచి మినహాయింపు ఇవ్వాలని చిదంబరం డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రతిపాదించిన పథకాలను తమ అంగీకారం లేకుండానే ఎన్డీఏ ప్రభుత్వం 2024 కేంద్ర బడ్జెట్‌కు అరువుగా తీసుకుందని చెబుతూ... 'దయచేసి మరికొంత కాపీ చేయండి' అని ఎద్దేవా చేశారు. 'మీరు ఆ ఆలోచనలను తీసుకుంటే... మీకు (బీజేపీ) మద్దతు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంటుంది. ఈ సభలో కాపీ చేయడం నిషేధించబడలేదు. వాస్తవానికి కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తుంది...బహుమతి ఇవ్వబడుతుంది' అంటూ ప్రతిపక్ష ఎంపీలను నవ్వించారు. నిరుద్యోగం గురించి ఆయన ప్రస్తావిస్తూ... దేశంలో నిరుద్యోగం అతిపెద్ద సవాలుగా ఉందన్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ జూన్ 2024లో దేశంలో నిరుద్యోగిత రేటు 9.2 శాతంగా ఉందని అంచనా వేసిందని చెప్పారు. పరిమిత ప్రైవేట్ రంగ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వేలాదిమంది బారులు తీరుతున్న పరిస్థితి ఉందని, ప్రభుత్వ ఉద్యోగాలకు లక్షలమంది దరఖాస్తు చేస్తున్నారన్నారు. 'ఉత్తరప్రదేశ్ పోలీస్ విభాగం 60,244 ఖాళీల కోసం పరీక్ష నిర్వహించింది... ఈ పరీక్షకు 48 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల తర్వాత ఇది రద్దు చేయబడింది. ఎయిర్ ఇండియా ముంబై రూ.22వేల వేతనం వచ్చే 2,216 ఖాళీలను భర్తీ చేయాలనుకుంటే 25వేల మంది ఇంటర్వ్యూల కోసం బారులు తీరారు' అని చిదంబరం పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని తీవ్రంగా పరిగణించాలని రాజ్యసభ చైర్మన్‌ను ఉద్దేశించి ఆయన అన్నారు. నిరుద్యోగ నిర్మూలనపై మోదీ సర్కారు చిత్తశుద్ధిలేదని... పథకాలు ప్రకటించిన ంత మాత్రాన సమస్య సమసిపోదని విమర్శించారు.

ఓడినా... గెలిచినా ప్రజాపోరాటాలే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కష్టజీవుల పార్టీ కమ్యూనిస్టుపార్టీ అని, ఓడినా... గెలిచినా కమ్యూనిస్టుపార్టీ ప్రజల తరపున పోరాడుతూనే ఉంటుందని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. స్థానిక శ్రీలక్ష్మీనరసింహకళ్యాణ మండపంలో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశానికి జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసినా మోదీ సర్కారును ప్రజలు నమ్మలేదన్నారు. 400 సీట్లు సాధిస్తామని గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోదీకి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు టీడీపీ, జేడీయూ మద్దతు తీసుకోవాల్సిన దుస్థితి బీజేపీకి పట్టిందని తెలిపారు. ఇండియా ఐక్యసంఘటన మెరుగైన ఫలితాలు సాధించినా...అనుకున్న సీట్లు రాలేదన్నారు. కమ్యూనిస్టులు తమ బలం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ పదేళ్ల కాలంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, డీజిల్, పెట్రోల్ ధరలకు అంతులేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, పేదరికం పెరిగిపోయిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మోదీ పాలనలో ధనవంతులు మరింత ధనవంతులుగాను, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని చెప్పారు. బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని, ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌లను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు.

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చీత్కారానికి గురయ్యారని చెప్పారు. పేరుకు ఐదుగురు ఉపముఖ్యమంత్రులను నియమించినా... అధికారమంతా తన అనుచరులు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధనుంజయరెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, జవహర్‌రెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డికి అప్పగించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను ఆదుకోవాలని, గ్రామాలకు రోడ్డు వసతులు కల్పించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు భరోసా వంటి హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేకహోదా ఒక్కటే సంజీవని అన్నారు. గ్రామస్థాయిలో సమస్యలపై దృష్టిసారించి...వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజాసంఘాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు జరపాలి: జేవీఎస్ఎన్

సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా 2024 డిసెంబరు 26 నుండి 2025 డిసెంబరు 26 వరకు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవాలని పార్టీ నిర్ణయించినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టుపార్టీ కీలకపాత్ర పోషించిందన్నారు. బ్రిటీష్ అధికారులు కమ్యూనిస్టులపై అక్రమకేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసినా పోరాటం ఆపలేదన్నారు. బ్రిటీష్ పాలకులను తరిమికొట్టడంలో కమ్యూనిస్టులు ముందువరుసలో ఉన్నారన్నారు. మోదీ ప్రభుత్వం మనువాద భావజాలంతో దేశాన్ని పాలించాలని చూస్తోందన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణకు బలమైన కమ్యూనిస్టు ఉద్యమం అవసరమని చెప్పారు. పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసేందుకు కృషిచేయాలన్నారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, ఆవుల శేఖర్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, అజయ్‌బాబు, భాస్కర్‌యాదవ్, పంపన్నగౌడ్, చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, రంగన్న, శ్రీరాములు, కారుమంచి, రాజాసాహెబ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్‌బాష, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నాయకులు సుదర్శన్, రాజు, గిడ్డమ్మ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా మునెప్ప సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రజానాట్యమండలి కళాకారుల పాటలు ఉత్తేజపరిచాయి.

మానవీయ కోణంలో పనిచేయండి

అధికారులకు సీఎం దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారులు బ్యూరోక్రటిక్ కోణంలో కాకుండా... మానవీయ కోణంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ప్రజలు సాయం కోరి వస్తే... ఆ సమస్య ఎలా పరిష్కరించాలనే దిశగా ఆలోచించాలని, కేవలం నిబంధనలను గురించి మాత్రమే ఆలోచిస్తే...అందరికీ మంచి చేయలేమని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్య శాఖాధిపతులతో బుధవారం సీఎం సమావేశమయ్యారు. వేగవంతమైన, ప్రభావితమైన గవర్నెన్స్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. 2014 విభజన తరువాత రాష్ట్రం ఇంత సంక్షోభంలో లేదన్నారు. కేంద్రం ఇచ్చే నిధులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వకపోగా, కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అన్ని వ్యవస్థలను మళ్లీ యాక్టివ్ చేయాలన్నారు. పేదరికం లేని సమాజం కోసం కలిసి పనిచేద్దామని చెప్పారు. తాను నాల్గోసారి సీఎంగా ఉన్నానని, కానీ ఎప్పుడూ లేనన్ని సమస్యలు, భిన్నమైన పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎక్కువ తలసరి ఆదాయం పొందుతోందని, నాడు తీసుకున్న నిర్ణయాలు, తెచ్చిన పాలసీల వల్లే ఈ ఫలితాలు వచ్చాయని చెప్పారు. అమెరికాలోనూ భారతీయులు ఎక్కువ తలసరి ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు. వైట్ అమెరికన్స్ 65 వేల డాలర్లు పొందుతుంటే... భారతీయులు 1.19 లక్షల డాలర్ల పొందుతున్నారని వివరించారు. 2014లో లోటు బడ్జెట్ తో పాలన ప్రారంభించినప్పటికీ, 43 శాతం పీఆర్సీ ఇచ్చి ఉద్యోగులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. నేడు రాష్ట్రంలో ఉన్నాయని, రూ.లక్ష కోట్ల వరకు బిల్లులు, బకాయిలు ఉన్నాయని చెప్పారు. విభజనకంటే ఎక్కువ నష్టం 2019 నుంచి ఉన్న వైసీపీ పాలన వల్ల జరిగిందన్నారు. మూడు పార్టీలు కలిసి పోటీ చేశామని, కేంద్రం కూడా ఇప్పుడు సాయం చేయడానికి ముందుకు వచ్చిందని, ఇది మంచి పరిణామం అని అన్నారు. పోలవరం, అమరావతితో పాటు వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వడానికి అంగీకరించారని చెప్పారు. రాయలసీమలో ఇండస్ట్రియల్ కారిడార్ కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

వైసీపీ హయాంలో భూదందా

ప్రజల నుంచి మంత్రి అనగాని వినతుల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు రికార్డు స్థాయికి చేరాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌తో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. అనగాని మాట్లాడుతూ ప్రభుత్వ అండదండలతో వైసీపీ నాయకులు భూ ఆక్రమణలతో చెలరేగిపోయారని, వాటిని అడ్డుకోవాల్సిన అన్ని వ్యవస్థలు చతికిల పడ్డాయని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజాదర్బార్‌లో భాగంగా వినతులు స్వీకరిస్తున్నామని, వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, ఆ పార్టీ నేతల భూ ఆక్రమణలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతి పత్రాలు వచ్చాయని వివరించారు. భూములను 22ఏలో పెట్టి, భూ యజమానులను బెదిరించి వారి నుంచి భూములను అక్రమంగా లాక్కున్నారని మండిపడ్డారు. భూ సర్వేల పేరిట రైతులపై ఒత్తిడి తెచ్చి, వారి భూములను దోచుకున్న పాపం వైసీపీ నాయకులదేనని చెప్పారు. అధికశాతం వినతులు విశాఖ ప్రాంతానికి చెందినవే ఉన్నాయన్నారు. ఉద్యోగులకు టీఏలు, డీఏలు కూడా ఇవ్వని అసమర్థ ప్రభుత్వంగా వైసీపీ నిలిచిందని విమర్శించారు. మీటర్ రీడర్లకుగాను టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3.60పైసలు ఇస్తే వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.3లకే పరిమితమైందని, మిగిలిన 60పైసలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో...వైసీపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ సిటీ, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టర్ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రజలిచ్చే ప్రతి వినతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి...సంబంధిత శాఖలకు పంపి న్యాయం చేస్తామన్నారు.

పొగాకు కొనుగోలుకు వర్తకులు, డీలర్లకు అనుమతివ్వాలి

న్యూఢిల్లీ: పంట సీజన్-2023-24లో ఆంధ్రప్రదేశ్‌లోని వేలం మాధ్యమాల ద్వారా పొగాకు కొనుగోలు చేసేందుకు పొగాకు బోర్డులో రిజిస్టర్ చేసుకున్న వర్తకులు, డీలర్లకు అనుమతి ఇవ్వాలని పొగాకు బోర్డుకు కేంద్రప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పొగాకు బోర్డు చట్టం-1975లోని 20ఏ సెక్షన్ ప్రకారం ఈ ఆదేశాలిచ్చింది. బోర్డు కింద నమోదైన సాగుదారులు ఉత్పత్తి చేసే వర్జీనియా పొగాకునకు సాధారణ చార్జీలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను వాణిజ్య, పరిశ్రమల శాఖ జారీచేసింది.

జగన్ ఆస్తుల కేసులో రోజువారీ విచారణ

తెలంగాణ హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: జగన్ ఆస్తులపై నమోదైన కేసుల్లో రోజువారీ విచారణ చేపట్టాలంటూ సీబీఐ కోర్టును బుధవారం తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈనెల మూడోతేదీ ఇచ్చిన ఆదేశాల ప్రకారం రోజువారీ విచారణను కొనసాగించాలని, దానిపై నివేదిక సమర్పించాలని పేర్కొంది. కేసుల విచారణను సత్వరం పూర్తిచేసేలా సీబీఐ కోర్టుకు ఆదేశాలివ్వాలని కోరుతూ మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య గతేడాది హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. విచారణను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని పిటిషన్లో పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్ కుమార్ లతో కూడిన ధర్మాసనం విచారించింది. గత ఆదేశాలను అమలు చేయాలని మరోసారి స్పష్టంచేస్తూ విచారణను ఆగస్టు 20కు వాయిదా వేసింది. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు జగన్ కేసుల్లో దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ కొనసాగుతోంది. అరబిందో, హెటిరోలకు భూకేటాయింపులకు సంబంధించి నమోదైన కేసులో రెండో నిందితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై సీబీఐ కోర్టు విచారణ చేపట్టింది. సాయిరెడ్డి తరపు న్యాయవాది జి. అశోక్ రెడ్డి వాదనలు వినిపించగా తదుపరి విచారణ వాయిదా పడింది.

పోలవరం ఈ ఐదేళ్లలో పూర్తయ్యే పరిస్థితి లేదు

జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఈ ఐదేళ్లల్లోనూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే పరిస్థితులు కన్పించడం లేదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలోని నీటి పారుదల శాఖ కూడా అధ్వాన్నంగా మారిందన్నారు. బుధవారం శాసన మండలిలో పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ అంశంపై సభ్యులు దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, వేపాడ చిరంజీవి తదితరులు ప్రశ్నించారు. నాటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో సోమవారం పోలవరం పేరుతో 72 శాతం పూర్తి చేయగా, అనంతరం వచ్చిన జగన్ ప్రభుత్వం పోలవరాన్ని గోదావరిలో ముంచెత్తారని విమర్శించారు. ప్రస్తుతం ఎంతవరకు ముంచేశారనేదీ, వాటి పనుల వివరాలు, పనితీరును వివరించాలని, రివర్స్ టెండర్ల పేరుతో మంత్రులు అంబటి రాంబాబు, అనిల్‌కుమార్ యాదవ్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మంత్రి రామానాయుడు సభ్యుల ప్రశ్నలకు బదులిస్తూ..పోలవరం ప్రాజెక్టుకు ఆర్థికపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చెప్పడం సంతోషకరమన్నారు. 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో పోలవరం హెడ్‌వర్క్స్, డయాఫ్రమ్ వాల్ పనులను పూర్తయ్యాయని... మొత్తంగా 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రివర్స్ టెండరింగ్ విధానంతో పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారిందని, ప్రాజెక్టు నిధులను దారి మళ్లించిందని మండిపడ్డారు. ఐదేళ్లల్లో రూ.4,167 కోట్లనే గత ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కేంద్రం నుంచి పాత రీయింబర్స్‌మెంట్ వచ్చినప్పటికీ....రూ.3,381 కోట్లను దారి మళ్లించారని వివరించారు. వైసీపీ హయాంలో 20 నుంచి 30 శాతం పనులు వెనక్కిపోయాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి వ్యవస్థ మొత్తం విధ్వంసంగా మారిందని విమర్శించారు.

రాజధాని నిర్మాణాల స్థితిగతులపై కమిటీ

- ఏడుగురు సభ్యులు... 9 అంశాలపై అధ్యయనం
- నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని ప్రాంతంలో నిలిచిపోయిన నిర్మాణాల స్థితిగతులపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక నిపుణులతో కూడిన కమిటీని నియమించింది. ప్రజారోగ్య శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ చైర్మన్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సభ్యులుగా అర్‌అండ్‌బీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఏపీసీపీడీసీఎల్, ఏపీ సీఆర్డీయే, ఏడీసీ సంస్థలకు చెందిన చీఫ్ ఇంజినీర్లు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుంచి ఒకరిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఏడుగురు సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటయింది. రాజధాని ప్రాంతంలో చేపట్టిన అన్ని రకాల రకాల నిర్మాణాలను పరిశీలించాలని సాంకేతిక కమిటీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిలిచిపోయిన నిర్మాణ పనులు ఎక్కడి నుంచి ప్రారంభించాలన్న అంశంపై ఈ కమిటీ సూచనలు చేయనుంది. సీఆర్‌డీఏ ప్రాంతంలో జరిగిన రహదారుల విధ్వంసం, పైపులైన్లు, డ్రెయిన్లు, విద్యుత్, వాటర్ పైపులైన్లు, వివిధ భవనాల నిర్మాణాల పటిష్టత, స్థితిగతులను పరిశీలించి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. అలాగే అమరావతి ప్రాంతంలో ఉన్న సమస్యలను కూడా క్షేత్రస్థాయిలో ఈ కమిటీ పర్యటించి గుర్తిస్తుంది.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు అర్థాంతరంగా నిల్చిపోవడంతో రాజధానిలోని అనేక ప్రాంతాల్లో కొంత నిర్మాణ సామాగ్రి నిరుపయోగంగా సంవత్సరాల తరబడి సరైన రక్షణ లేకుండా పడి ఉంది. అటువంటి పైప్‌లు, ఇనుము, ఇతర పరికరాల సేవా సామర్థ్యాన్ని కమిటీ ఎంతవరకు పనికొస్తాయనే దానిపై అంచనా వేస్తుంది. అలాగే గతంలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థల నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా అధ్యయనం చేసి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. మొత్తం 9 అంశాలపై ఈ కమిటీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

పింఛన్ రూ.50 వేలకు పెంచండి

సీఎంకు ఏపీ మాజీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

తెలంగాణ ప్రభుత్వ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్ పెంపునకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడుకు ఏపీ మాజీ లెజిస్లేటర్స్ ఫోరమ్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వెలగపూడిలోని సీఎంవో కార్యాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును ఫోరమ్ గౌరవాధ్యక్షుడు దివి శివరామ్ (మాజీ ఎమ్మెల్యే), అధ్యక్షుడు ఎంవీ శివారెడ్డి(మాజీ ఎమ్మెల్సీ), వైస్ ప్రెసిడెంట్ జల్లి విల్సన్ (మాజీ ఎమ్మెల్సీ), కార్యదర్శి పసల కనక సుందరరావు (మాజీ ఎమ్మెల్యే), రుద్రరాజు పద్మరాజు (మాజీ ఎమ్మెల్సీ) కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీజేపీపక్ష నేత విష్ణుకుమార్‌రాజ్, వైసీపీ, జనసేన శాసనసభ పక్ష కార్యాలయాలకు వెళ్లి ఆయా పార్టీ ప్రతినిధులకు వినతిపత్రాలను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ శాసనసభ్యులు ఏళ్లతరబడి ప్రజా జీవితంలో మమేకమై సేవలు చేస్తూనే ఉన్నారని వివరించారు. వృద్ధాప్యంలో శారీరక రుగ్మతలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎక్కువమంది బడుగు, బలహీనవర్గాలకు చెందిన పేదవారే ఉన్నారని తెలిపారు. అధిక ధరలు, కుటుంబ భారాలు, అవసరాలు పెరిగిపోయిన దృష్ట్యా ప్రస్తుతం నెలకు ఇస్తున్న పెన్షన్ రూ.30 వేలు సరిపోవడం లేదన్నారు. గత 10 సంవత్సరాలుగా పెరుగుదల లేదని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధులకిచ్చే పెన్షన్‌ను పరిగణనలోకి తీసుకుని... మన రాష్ట్రంలో పింఛన్‌ను రూ.50 వేలకు పెంచి అమలుపర్చాలని కోరారు. పెన్షన్‌కు చెందిన తెలంగాణ ప్రభుత్వ గెజిట్‌ను ఆ వినతితో జత చేసినట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మాజీ శాసనమండలి, మాజీ శాసనసభ్యులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందులను రాష్ట్ర సచివాలయంలో ఉన్న డిస్పెన్సరీకిగానీ, జిల్లా కేంద్ర ఆసుపత్రికిగానీ వచ్చి తీసుకోవడం చాలా ఖర్చుతో, శ్రమతో కూడి కష్టతరమవుతోందని వివరించారు. కొంతమంది మంచానికే పరిమితమయ్యారన్నారు. గత ఆరు ఏడు నెలలుగా మందుల సరఫరా కూడా లేదని చెప్పారు. మాకు అందుబాటు ఉన్న బ్రాండెడ్ మెడికల్ షాపుల నుంచి గాని, కొరియర్ ద్వారా గాని అందజేసి ఆదుకోవాలని కోరారు. కొందరు సరైన నివాసంలేక ఇబ్బందులు పడుతున్నారని, రాజధాని అమరావతి ప్రాంతంలో 500 చదరపు గజముల విస్తీర్ణం కలిగిన ఇళ్లస్థలాలను నామ మాత్రపు ధరకు ఇచ్చి అన్ని మౌలిక సౌకర్యములు కల్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఏపీ గెస్ట్ హౌస్‌లో నామమాత్రపు ధరతో క్లాస్-3తో వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. ఫోరం కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వాధినేతలు, అధికారులను కలుసుకునేందుకు అసెంబ్లీ ప్రాంగణంలో గదిని కేటాయించి, నిర్వహణకు సిబ్బందిని నియమిం చాలని విన్నవించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ సౌకర్యం, గౌరవం కల్పించాలని కోరారు. మాజీ ప్రజాప్రతినిధులు ప్రయాణించే వాహనాలకు టోల్ ఫ్రీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో సహా గ్రేడ్-1 దేవస్థానాలలో దైవదర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అమరావతి రైల్వే లైన్‌కు పచ్చజెండా

- రూ.820 కోట్లతో విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి
- ఏపీకి రికార్డు స్థాయిలో రూ.9,151 కోట్లు
- విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కేంద్ర బడ్జెట్-2024-25లో రైల్వే ప్రాజెక్టులకు ఆంధ్ర ప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,151 కోట్లు కేటాయించారని డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. బుధవారం డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బడ్జెట్ ముఖ్యాంశాలను వర్చువల్‌గా మీడియాకు వివరించారు. అనంతరం డీఆర్ఎం పాటిల్ సవివరంగా మాట్లాడుతూ అమరావతి నూతన రైల్వే ప్రాజెక్టుకు అమోదం లభించిందన్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను రైల్వే బోర్డు అమోదించిందని, నీతి ఆయోగ్ పరిశీలనలో ఉందని తెలిపారు. ఈ నూతన రైలు మార్గం యర్రపల్లి నుంచి అమరావతి వరకు దాదాపు 56.5 కిలో మీటర్లు ఉండవచ్చని తెలిపారు. కృష్ణా నదిపై బ్రిడ్జి కూడా నిర్మాణం చేయవలసి ఉందని, ఇందుకు దాదాపు 2 వేల 47 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అమృత భారత్ స్టేషన్లలో భాగంగా విజయవాడ రైల్వేస్టేషన్ రూపురేఖలు పెద్దఎత్తున మారిపోతున్నాయన్నారు. రూ.820 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. దాదాపు నూతన హంగులతో ప్రజలకు అధునాతనమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే రాజమండ్రి స్టేషన్ అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు జరుగుతున్నాయని అన్నారు. భారతీయ రైల్వేలకు 2024-25 సంవత్సరానికి రూ.2,62,000 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. రైల్వేలను ప్రపంచ స్థాయికి చేర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గణనీయమైన మొత్తం అంటే... రైల్వేలో భద్రత సంబంధిత కార్యకలాపాలకు రూ.1.09 లక్షల కోట్లు కేటాయించారని వివరించారు.

రాష్ట్రానికి కేటాయింపులివే...

ఆంధ్ర ప్రదేశ్‌లో రైల్వేలకు మొత్తం బడ్జెట్ కేటాయింపులు 2024-25 సంవత్సరానికి రూ.9,151 కోట్లు అని డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. 2009-14 సంవత్సరాలలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు బడ్జెట్ వ్యయం రూ.886 కోట్లు. ఏపీకి బడ్జెట్ కేటాయింపులు 2009-14 మధ్య కాలంలో చేసిన సగటు కేటాయింపుల కంటే ప్రస్తుత సంవత్సరం కేటాయింపులు దాదాపు పది రెట్లు పెరిగాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల (కొత్త ట్రాక్‌లు) మొత్తం విలువ రూ.73,743 కోట్లు. ఆంధ్ర ప్రదేశ్‌లో రైల్వే వ్యవస్థను ఇప్పుడు 100 శాతం విద్యుదీకరించటం పూర్తయింది. 2009-14లో కేవలం 73 కిలోమీటర్లతో పోలిస్తే గత పదేళ్లలో ఏపీ రాష్ట్రవ్యాప్తంగా 151 కిలోమీటర్ల (సంవత్సరానికి సగటున) కొత్త రైల్వే ట్రాక్‌లు వేశారు. భద్రత కోసం 743 ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రాష్ట్రంలోని 73 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికవేత్త కురియన్ కన్నుమూత



చెన్నై: ప్రముఖ ఆర్థికవేత్త, మద్రాస్ క్రిస్టియన్ కాలేజి మాజీ ప్రొఫెసర్ సీటీ కురియన్ (93) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో మంగళవారం రాత్రి 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. కురియన్ 1953లో మద్రాస్ క్రిస్టియన్ కాలేజి నుంచి ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ పట్టా పొందారు. ఎకనామిక్స్ చదవడం ద్వారా పేదరికానికి కారణాలను, దానిని నిర్మూలించే మార్గాలను తెలుసుకోవాలనుకున్నారు. అయితే పేదరికాన్ని తీవ్రంగా పరిగణించని పరిస్థితుల్లో ఆర్థిక శాస్త్రాన్ని మరింత లోతుగా చదవాలని భావించారు. దీంతో స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ (1958-63) చేశారు. 1968-69లో యాలే యూనివర్సిటీలో విజిటింగ్ ఫెలోగా ఉన్నారు. 1962-78లో మద్రాస్ క్రిస్టియన్ కాలేజి ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1978-91లో మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్‌గా, 1978-88లో డైరెక్టర్‌గా వ్యవహరించారు. యూజీసీ, భారత సామాజిక శాస్త్ర పరిశోధన మండలిలో నేషనల్ ఫెల్లోగా ఉన్నారు. 2000లో భారత ఆర్థిక సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు వహించారు. ఎకనామిక్స్‌లోని వివిధ అంశాలపై 15 పుస్తకాలు రాశారు. 2021, జులై 31న 'ది హిందూ'కు ఓ ఇంటర్వ్యూ ఇచ్చిన ప్రొఫెసర్ కురియన్ 'నా సౌకర్యవంతమైన జీవితాన్ని చుట్టుముట్టిన పేదరికం గురించి చిన్న వయస్సులోనే తెలుసుకున్నా. నా రాతల్లోనూ పేదరికం గురించే ప్రధానంగా ఉంటుంది. వృద్ధి సాధిస్తే పేదరికం దానంతట అదే రూపుమాపగలదన్నది తప్పుడు అంచనా' అని అన్నారు. ప్రొఫెసర్ కురియన్ 90వ పుట్టిన రోజు సందర్భంగా కేరళ సీఎం పినరయి విజయన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ సందేశం పంపారు. 'ప్రొఫెస్ కురియన్... సామాజిక, ఆర్థిక వ్యవహారాలపై గొప్ప కాలమిస్ట్. ప్రజలకు విస్తృత ప్రయోజనాలు కలిగించే విధానాలకు ఎప్పుడూ మద్దతిస్తారు' అని విజయన్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ కురియన్ మృతికి ది హిందూ పబ్లిషింగ్ గ్రూపు డైరెక్టర్ ఎన్.రామ్ సంతాపాన్ని ప్రకటించారు. 'గొప్ప మేధావి, అభిమాన అధ్యాపకుడు, ప్రగతిశీల మేధావి, గొప్ప మిత్రుడు సీటీకే... పేదరికాన్ని నిర్మూలించడం, ప్రజల జీవితాలను మెరుగుపర్చడం కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. ఇందుకోసం ఎన్నో అధ్యయనాలు చేశారు' అని ఎక్స్‌లో రామ్ పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.